RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18 వ వసంతంలోకి

ఎడిటర్ : బూర్ల వెంకన్న కరీంనగర్ సంపుటి :17 సంచిక :341 బుధవారం , ఏప్రిల్ 8 , 2026, పేజీలు -20 వెల :5/-

# విజయన్, మోడీ మంచి మిత్రులు

## ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వం పై విమర్శలు - మిగతా2లో



# కాంగ్రెస్ కోసం సైనికుల్లా పని చేయాలి




తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. - మిగతా2లో

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

## కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ - మిగతా2లో



# బెంగాల్ పై కన్నేస్తే..పాక్ ముక్కలే

తెలంగాణ పత్రిక ప్రతినిధి

పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్ పై కన్నేస్తే ఈ సారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. - మిగతా2లో



# ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

తెలంగాణ పత్రిక ప్రతినిధి

పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ - మిగతా2లో



# ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగి పోతున్నాయని ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్ పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని. - మిగతా2లో



# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పు పట్టారు. - మిగతా2లో



# హైదరాబాద్ పాతబస్తీలో బెంగాలీలు ఉండలేని పరిస్థితి ఏర్పడింది



తెలంగాణ పత్రిక ప్రతినిధి

హైదరాబాద్ పాతబస్తీలో శాంతి భద్రతలు క్షీణించాయని, అక్కడ బెంగాలీ కుటుంబాలు నివసించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీకి ఒక రూల్, ఇతర ప్రాంతాలకు మరో రూల్ అమలు చేస్తున్నారా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా - మిగతా2లో

# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త


తెలంగాణ పత్రిక ప్రతినిధి

వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరా పై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. - మిగతా2లో




# అజాగ్రత్తగా డ్రైవ్ చేయవద్దు

## రోడ్ సేఫ్టీ పై డిజిపి శివధర్ రెడ్డి



తెలంగాణ పత్రిక ప్రతినిధి

అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని - మిగతా2లో

## విజయన్, మోడీ మంచి మిత్రులు

-మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

## కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

-మొదటిపేజీ తరువాయి

మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారడు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు. మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. ÷రిజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు . కాగా, మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై వచ్చిన ఈ వార్తలు ఇరాన్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు. అందువల్ల ఇప్పటికి ఇవి కేవలం నివేదికల ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.

## వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్టిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీనీ)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

## ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

-మొదటిపేజీ తరువాయి

ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగి పోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొ÷ళ్లైను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు.

# కాంగ్రెస్ కోసం సైనికుల్లా పని చేయాలి

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బెంగాల్ పై కన్నేస్తే..పాక్ ముక్కలే

-మొదటిపేజీ తరువాయి

ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్ పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతా పై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారే సుకున్నారు. దీని పై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

-మొదటిపేజీ తరువాయి

మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళ్తుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటు న్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తన్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు.

## హైదరాబాద్ పాతబస్తీలో బెంగాలీలు ఉండలేని పరిస్థితి ఏర్పడింది

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ పాతబస్తీలో శాంతిభద్రతలు క్షీణించాయని, అక్కడ బెంగాలీ కుటుంబాలు నివసించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీకి ఒక రూల్, ఇతర ప్రాంతాలకు మరో రూల్ అమలు చేస్తున్నారా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. నిన్న రాత్రి పాతబస్తీలోని బెంగాలీ కుటుంబాలతో బండి సంజయ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాతబస్తీలో అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు వెళ్లిన జీహెచ్ఎంసీ అధికారులపై ఎంఐఎం నేతలు దాడి చేసినా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అదే ఇతర ప్రాంతాల్లో బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేస్తే లాఠీఛార్జులు, కేసులు పెడుతున్నారని ఆయన గుర్తుచేశారు. 'ముఖ్యమంత్రి గారూ.. పాతబస్తీని ఏమైనా మజ్లిస్‌కు రాసిచ్చారా? ఎంఐఎం నేతలు దాడులు, దౌర్జన్యాలు చేసుకోవడానికి పర్మిషన్ ఇచ్చారా?' అని బండి సంజయ్ నిలదీశారు. ఎంఐఎం గూండాల కారణంగా బెంగాలీలు ఇబ్బందులు పడుతున్నారని, వేల సంఖ్యలో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు నగరంలోకి అక్రమంగా చొరబడి ఓటర్ కార్డులు కూడా పొందారని ఆరోపించారు. అధికారులపై దాడులు చేసేవారిపై చర్యలు తీసుకోకపోతే పాతబస్తీలో పరిస్థితులు చేయిదాటిపోతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతివ్వాలని అక్కడి బెంగాలీ సమాజాన్ని ఆయన కోరారు.

# అజాగ్రత్తగా డ్రైవ్ చేయవద్దు

-మొదటిపేజీ తరువాయి

అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పామునూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం జరగాలని చెప్పుకొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. తీవ్రవాద ప్రాంతంలో ఇంత త్వరగా రోడ్లు వేయడం అభినందనీయమని అన్నారు. రోడ్లు వేయడంతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు.

## రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

-మొదటిపేజీ తరువాయి

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# నాయి బ్రాహ్మణుల సమస్యలపై జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు







-కలెక్టర్‌కు వినతిపత్రం
-పరిష్కారం లేకపోతే ఉద్యమం ఉధృతం

కొత్తగూడెం ఆర్ సి ఏప్రిల్ 07(తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాయి బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇదే అంశంపై జిల్లాలోని 23 మండలాల ఆర్డీవో కార్యాలయాల్లో కూడా వినతిపత్రాలు అందజేశారు. సంఘం నాయకులు వివరించిన సమస్యలలో ముఖ్యంగా సంప్రదాయ వృత్తికి చట్టపరమైన రక్షణ కల్పించడం, ఇతరులు వృత్తిని ఆక్రమించకుండా చర్యలు తీసుకోవడం, కులవివక్ష ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి అంశాలు ఉన్నాయి. అలాగే, గతంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.1 లక్ష ఆర్థిక సహాయం అర్హులందరికీ అందలేదని, వెంటనే మిగిలిన వారికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాలు, మున్సిపల్ ప్రాంతాల్లో నాయి బ్రాహ్మణులకు దుకాణ స్థలాలు, షెడ్లు కేటాయించి జీవనోపాధి సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిల్లా కేంద్రంలో సంఘానికి ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి కనీసం 200 గజాల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా, నాయి బ్రాహ్మణుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం జరగకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గౌరవ అధ్యక్షులు కురిమల శంకర్, ఉబ్బనపల్లి కాశయ్య, నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు రాచకొండ శ్రీనివాసరావు, దడిగాల మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరసవిల్లి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇంచార్జ్ దడిగల కొండయ్య, జనగామ వంశి, డివిజన్ అధ్యక్షుడు పెనుగంటి హరికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కడియాల శ్రీ నివాసరావు, యూత్ అధ్యక్షుడు ఉబ్బనపల్లి వినీల్, జిల్లా నాయకులు ఉబ్బనపల్లి శ్రీనివాసరావు, కడియాల లాలయ్య, ముద్దునూరు అప్పారావు, మందల కనకరాజు, కడియాల సిద్దు, కురుమళ్ళ వేణు, ఏడుకొండలు, నాగు, సైదులు, మహేష్, జీడుగు శ్రీనివాసరావు, కంది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ



చండూర్ తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చండూర్ మండలం పుల్లెంల గ్రామానికి చెందిన బొడ్డు సత్తయ్య 24,000/- బొడ్డు వెంకన్న 15,000/- లోక జయశ్రీ 60,000/- నీలకంఠం మారయ్య 27,000/- ముక్కముల రాజు 24,000/- పాలకూరి సైదులు 15,000/- ఎర్ర యాదగిరి 60000/- రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కముల వెంకన్న,ఉప సర్పంచ్ చెడుబుద్ధి ఉషయ్య, మాజీ ఎంపీటీసీ వడ్డగోని రాఘవేందర్,కాంగ్రెస్ మండల నాయకులు మందడి శంకర్ రెడ్డి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు వడ్డగోని చంద్రశేఖర్ గౌడ్, ముక్కముల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# జల దోపిడిని ప్రశ్నిస్తే అరెస్టులా? ఇదేనా ప్రజాస్వామ్యం: గౌని నాగేశ్వరరావు

కొత్తగూడెం ఆర్సి ఏప్రిల్ 07 తెలంగాణ పత్రిక



జల వనరుల దోపిడిపై ప్రశ్నించిన నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండనీయమని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. కొత్తగూడెం రైటర్ బస్తి ఐఎఫ్టీయూ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించిన జల సూత్రాలకు వ్యతిరేకంగా మున్నేరు ప్రాజెక్టు నీటిని పాలేరు రిజర్వాయర్‌కు మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాలోని గార్ల--బయ్యారం ప్రాంతంలో మున్నేరు ప్రాజెక్టు నీటిని తరలించే సర్వేను అడ్డుకుంటామని అఖిలపక్ష నాయకులు చెప్పిన నేపథ్యంలో, వారిని అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఈ సందర్భంగా గార్ల బయ్యారం మున్నేరు జలసాధన కమిటీ కన్వీనర్ గౌని ఐలయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు జడ సత్యనారాయణ, జి సక్రు, విద్యావంతుల వేదిక కన్వీనర్ విశ్వం, సిపిఎం, సిపిఐ నాయకులు కందుకూరు శ్రీనివాస్, కట్టబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు టిక్యా లక్ష్మణ్ తదితరులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. మున్నేరు ప్రాజెక్టు పాకాల చెరువు నుంచి ప్రారంభమై గార్ల--బయ్యారం ప్రాంతాల ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చేరుతుందని, దీని ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశముందని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు చేపట్టగా, తరువాతి కాలంలో అది నిలిచిపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం జీఓ నెంబర్ 98 ద్వారా ముగ్గురు మంత్రులకు అధికారం ఇచ్చి, స్థానిక నిబంధనలు, జల సూత్రాలకు విరుద్ధంగా నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. లోతైన కాలువల ద్వారా మున్నేరు నీటిని నేరుగా పాలేరు రిజర్వాయర్‌కు తరలించే సర్వేలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గ్రామ కమిటీలు, పిసా యాక్ట్ కమిటీలు చేసిన తీర్మానాలకు అనుగుణంగా మున్నేరు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. అరెస్టు చేసిన అఖిలపక్ష నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మరియు ఐఎఫ్టీయూ నాయకులు ఎన్. సంజీవ్, మోతుక్కూరి మల్లికార్జునరావు, వెంకటమ్మ, రాధా, కరుణ, శరత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన ఆసుపత్రి నందు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యం పై అవగాహన సదస్సు



భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

కొత్తగూడెం సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ ఆర్.కిరణ్ రాజకుమార్ ఆదేశాల మేరకు మంగళవారం న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 10.00 గంటలకు సింగరేణి మెడికల్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి . లలిత ఆరోగ్యం పై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భముగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.లలిత మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) స్థాపించబడిన జ్ఞాపకార్థం, 1950వ సంవత్సరం నుండి ప్రతీ ఏడాది ఏప్రిల్ 07 వ తారీఖున ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నామని, "ఆరోగ్యం కోసం కలసి కట్టుగా. శాస్త్రీయ విధానానికి మద్దతుగా" (టుగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్) అనే నినాదం తో ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నాం అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ప్రధాన ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ప్రతి ఒక్కరూ వారి వారి వ్యక్తిగత జీవితాలలో తప్పనిసరిగా వారి ఆరోగ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఆహారపు అలవాట్లను, పాటించవలసిన వ్యాయామాలను వివరిస్తూ ప్రతి ఒక్కరికి ఈ విషయాలపై అవగాహన ఉండాలని హాజరైన అందరికీతెలియజేశారు. ఈ కార్యక్రమం లో హెల్త్ డాక్టర్ డి. లలిత తో పాటు మెయిన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు .

# గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు










-భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా. రవి బాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్ (టి వి వి పి) ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా మంగళవారం అవార్డుల ప్రదానం హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ ఒ హెల్త్ సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో సిహెచ్ సి పాల్వంచకు చెందిన డా. శైలేష్ కుమార్ (సిఐఎస్-ఆర్థో), డా. పి. రామ్ ప్రసాద్ (డివైసిఎస్-అనస్తీషియా), ఏరియా హాస్పిటల్ భద్రాచలం నుంచి డా. క్రపా విజయ్ (డి వై సి ఎస్ పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి, అబ్బాస్ సేవలలో ఎ. వెంకట రావు (98%), అలాగే ల్యాబ్ సేవల విభాగంలో భద్రాచలం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ ఉన్నారు. ఏరియా హాస్పిటల్ మనుగూరు నుంచి నర్సింగ్ ఆఫీసర్ మానస , సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్--I ఏ. శారధ అవార్డులు అందుకున్నారు. అదనంగా భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డీ సి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు మూడు అవార్డులు ఆయా సూపరింటెండెంట్లు అయిన రామ కృష్ణ, గౌరీప్రసాద్, సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు. జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందగా, ఈ అవార్డులు గిరిజన ప్రజలకు అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచాయి.

# మస్జీద్ అనుబంధ భూమి కొనుగోలుకు సర్పంచ్ ఆర్థిక సహాయం

-నర్మాల గ్రామం మతసామరస్యానికి నిదర్శనం
-ప్రత్యేక్క ధన్యవాదాలు తెలిపిన అధ్యక్షులు షేక్ షబ్బీర్



గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో మస్జీద్ అనుబంధ భూమి కొనుగోలు కోసం నర్మాల గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన అంజనేయులు 20000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు మంగళవారం ఈ మొత్తాన్ని ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ తో పాటు కమిటీ సభ్యులకు అందజేశారు ఈ సందర్భంగా గ్రామంలో మత సామర్థ్యానికి ఇది మంచి ఉదాహరణగా నిలుస్తుందని స్థానికులు తెలిపారు మస్జీద్ అభివృద్ధికి తమ వంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని సర్పంచ్ పేర్కొన్నారు గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు కలిసి పనిచేయాలని ఆకాంక్షించారు సహాయం అడిగిన వెంటనే ఆర్థిక సహాయం కోసం ముందుకు వచ్చిన నర్మాల సర్పంచ్ రాజబోయిన అర్చన అంజనేలు కి ముస్లిం కమిటీ తరుపున షేక్ షబ్బీర్ ప్రత్యేక్క ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు కళ్యాణ్ కుమార్, చంద్రయ్య, గ్రామస్తులు రత్నాకర్ , బాలనర్సు, శ్రీనివాస్, ఏడబోయిన అనీల్, ముస్లిం కమిటీ ఉప అధ్యక్షులు ఆసిఫ్, కోశాధికారి సమీర్, సభ్యులు హైదుల్ హుస్సేన్, అహ్మద్ హుస్సేన్, జహీర్ తదితరులు ఉన్నారు.

# కందికట్కూర్ లో హిందూ సమ్మేళన సమితి ఏర్పాటు

ఇల్లంతకుంట ఏప్రిల్ 7 తెలంగాణ పత్రిక



ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామంలో ఉప మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో హిందూ సమ్మేళన నిర్వహణపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఖండ జాగరణ సమితి సభ్యులు బత్తిని ఆంజనేయులు, కాసుపాక కిషన్, చల్లా సాగర్ పాల్గొన్నారు.ఉప మండలంలోని ఎనిమిది గ్రామాల నుంచి కార్యకర్తలు హాజరై, హిందూ సమ్మేళన నిర్వహణ కోసం ప్రత్యేక సమితిని ఏర్పాటు చేశారు. కందికట్కూర్ గ్రామానికి చెందిన వటకూరి నరేందర్‌ను అధ్యక్షుడిగా, వల్లంపట్లకు చెందిన కట్ట శ్రీకాంత్ రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి సమితి ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి మరియు ఇతర కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ నెల 19న ఆదివారం సాయంత్రం 5 గంటలకు శేషాద్రి గార్డెన్ సమీపంలో హిందూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారిని పక్కాగా ముఖ నిర్ధారణ ప్రక్రియ

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 07 ఏప్రిల్

జిల్లాలో ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారిని పక్కాగా ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మెదక్ పట్టణం ఫేషియల్ (ముఖ) నిర్ధారణ ప్రక్రియలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని, ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ప్రభుత్వ పెన్షన్లు పొందుతున్న వారి నుండి ఫేషియల్ నిర్ధారణ ప్రక్రియను యాప్ ద్వారా చేస్తామన్నారు. ఈ ప్రక్రియ ఈరోజు ,రేపు మెదక్ పట్టణంలోని 7, 20, 21 ,22 వార్డుల్లో కొనసాగుతుందన్నారు. వార్డ్ ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది నాలుగు బృందాలుగా ప్రక్రియలు చేపడుతుందన్నారు. నిర్ధారణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మరణించిన వారిని పెన్షన్ పథకం నుండి తొలగించడానికి, పెన్షన్ పొందుతున్న వారిని నిర్ధారించడానికి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శ్రీనివాసరావు, సర్ఫ్ డైరెక్టర్ సోషల్ సెక్యూరిటీ గోపాల్, ప్రాజెక్టు మేనేజర్ గోవర్ధన్ టి. జి అన్జైన్, కృష్ణంరాజు, మృనాల్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దైవానుగ్రహం ఉంటేనే చేసే ప్రతి పనిలో విజయం

-రేణుక ఎల్లమ్మ,కంఠ మహేశ్వర స్వామి దేవాలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

-ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ పొగాకుల కొమురయ్య గౌడ్



ఆత్మకూర్, ఏప్రిల్ 8 (తెలంగాణ పత్రిక):

మనుషుల జీవితంలో దైవానుగ్రహం ఉంటేనే చేసే ప్రతి పనిలో విజయాలు సాధ్యమవుతాయని రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణ కమిటీ చైర్మన్ పొగాకుల కొమురయ్య గౌడ్ తెలిపారు. ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రేణుక ఎల్లమ్మ దేవాలయం మరియు కంఠ మహేశ్వర స్వామి దేవాలయాల నిర్మాణ కార్యక్రమాలకు ప్రజలు భక్తి శ్రద్ధలతో సహకరించాలని ఆయన కోరారు.మంగళవారం దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయ నిర్మాణం ఒక పవిత్రమైన కార్యమని, ఇందులో భాగస్వాములయ్యే ప్రతి ఒక్కరికి దేవతల ఆశీస్సులు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా గుర్రం మంజుల ప్రభాకర్ దేవాలయ నిర్మాణానికి రూ.50,116 విరాళంగా అందజేశారు. వారి సేవాభావాన్ని కమిటీ సభ్యులు అభినందించారు.ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేసి మే నెల మొదటి వారంలో దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్ వెల్లడించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలతో పాటు భక్తులు, దాతలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి విరాళాలు అందజేసి ఆలయ నిర్మాణానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏరుకొండ పైడి, పొగాకుల రమేష్, బూర మహేందర్, భయ్యగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ఊర్కొండ ఏప్రిల్ 07 (తెలంగాణ పత్రిక)



నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం నర్సంపల్లిలో ఆపదలో ఉన్న పేదవాడికి అండగా సీఎం సహాయనిధి పనిచేస్తుందని గ్రామ సర్పంచ్ పులిమామిడి శైలజ శ్రీశైలం అన్నారు. మండల పరిధిలోని నర్సంపల్లి గ్రామానికి చెందిన చిమ్మల రాఘుమారెడ్డికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి సహకారంతో సీఎం సహాయనిధి నుండి 27000 వేల రూపాయల చెక్కును మంగళవారం గ్రామ సర్పంచ్ శైలజ శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు కలిసి లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి ఆపదలో సీఎం సహాయ నిధి అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వీరెడ్డి వెంకట్ రెడ్డి, చిమ్ముల తిరుపతిరెడ్డి, వెంకట్ రెడ్డి, నిరంజన్ ,జంగయ్య , సీతమ్మ, బుక్ కీపర్ పరమేశ్వరి, గ్రామస్తులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

-ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలి

-స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకున్న కలెక్టర్

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 07 ఏప్రిల్

మంగళవారం ,ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా హవేలీఘనాపూర్ మండలంలోని సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పలు ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. '»Together for Health -- Stand With Science అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ, ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించి, మిల్లెట్ ఆహారం, పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా పరిగణించాల్సిన అవసరం ఉందని, ఒత్తిడి, ఆందోళనలను తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం వంటి పద్ధతులను అనుసరించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు, జీవనశైలి సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదించాలని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ,స్థానిక సర్పంచ్ ,పిహెచ్సి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల పరిస్థితులను అడిగి తెలుసుకున్న సిఐటియు నాయకులు

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 7:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ పట్టణంలో గల రైస్ మిల్లులో పనిచేస్తున్న హమాలీ కార్మికుల స్థితిగతులపై సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నాడు సర్వే నిర్వహించారు. సర్వేలో సిఐటియు నాయకులు మల్లేష్ గౌతమ్ రెడ్డి పట్టణంలోని పలు రైస్ మిల్లులు తిరిగి అందులో పని చేస్తున్న హమాలి కార్మికుల వద్దకు వెళ్లి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తమకు కలిగే ఇబ్బందులను వివరించారు. ముఖ్యంగా ఎనిమిది గంటల పని స్థానంలో 12 గంటలు పని చేయించుకుంటున్నారని తమకు కనీసం ఈఎస్ఐ పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించడం లేదని తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టు క్యాజువల్ అప్రెంటిస్ హోదాలను పనిచేస్తున్న కార్మికుల స్థితిగతుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ మిల్లులో పనిచేసే వివిధ రకాలైన కార్మికులకు కనీస వేతనాలను ఇవ్వడం లేదని వారి జీవితాలు హస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. హమాలీ కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని అదే విధంగా ఈఎస్ఐ, పిఎఫ్ లాంటివి సౌకర్యాలు కల్పించాలని వారి డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8గంటల పని విధానాన్ని యాజమాన్యాలు విస్మరించి కార్మికులతో 12 గంటలు పని చేయించుకుంటున్నారని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని కోరారు. వలస కార్మికులకు ప్రభుత్వం ఇండ్లు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నీతో పాటు పని చేస్తున్న మహిళా కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యజమాన్యాలు వెనుకడుతున్నాయని వీటన్నింటిని పరిష్కరి అయ్యేంతవరకు తమ పోరాటాలు చేసి సాధించుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామ్మూర్తి, రవి నాయక్, మల్లయ్య దేవయ్య, ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ పట్టణంలో రైస్ మిల్లర్స్ తో అత్యవసర సమావేశం





-ధాన్యం కొనుగోలను పునః ప్రారంభించిన రైస్ మిల్లుల యజమానులు

-రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వాలి....ఎమ్మెల్యే బిఎల్అర్

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 7:(తెలంగాణ పత్రిక):-

మిర్యాలగూడ రైస్ మిల్లుల్లో పునఃప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు గత రాత్రి రైతులకు,మిల్లర్లకు మధ్య జరిగిన వాగ్వాదం నేపథ్యంలో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు అధికారుల జోక్యంతో కొనుగోలు మళ్లీ ప్రారంభించడం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ రాజశేఖర్ రాజ్ మిల్లర్లతో జరిపిన అత్యవసర చర్చలు సఫలమయ్యాయి. ధాన్యం కొనుగోళ్ల నిలిపివేతతో రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో జిల్లా యంత్రాంగం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వెంటనే స్పందించింది జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు డీఎస్పీ రాజశేఖర్ రాజు సంయుక్తంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మిల్లుల వద్ద నిలిచిపోయిన ధాన్యం ట్రాక్టర్లను వెంటనే ఖాళీ చేయించి, కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారుల బృందం మిల్లర్లను ఆదేశించింది. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా చూడాలని, ధరల విషయంలో రైతులకు నష్టం కలగకూడదని ఎమ్మెల్యే బిఎల్ఆర్ స్పష్టం చేశారు. అన్నదాతలతో మిల్లర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని అధికారులు సూచించారు. అధికారుల ఆదేశాలకు మిల్లర్లు సానుకూలంగా స్పందించి, తక్షణమే కొనుగోళ్లు చేపడుతున్నట్లు ప్రకటించారు. దీంతో హైవేపై ధర్నా చేస్తున్న రైతులు తమ నిరసనను విరమించి మిల్లుల వద్దకు చేరుకున్నారు. వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని రైస్ మిల్లర్స్ యజమానులు పాల్గొనడం జరిగింది.

# నాయి బ్రాహ్మణుల సమస్యలపై ఉద్యమం మరింత ఉధృతం అవుతుంది: ఉబ్బనపల్లి కాశయ్య

కొత్తగూడెం ఆర్సి ఏప్రిల్ 07 (తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాయి బ్రాహ్మణుల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఉబ్బనపల్లి కాశయ్య హెచ్చరించారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాశయ్య మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణుల సంప్రదాయ వృత్తికి చట్టపరమైన రక్షణ కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఇతరులు ఈ వృత్తిని ఆక్రమించడం వల్ల నిజమైన వృత్తిదారులు జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులవివక్ష ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రభుత్వం ప్రకటించిన రూ.1 లక్ష ఆర్థిక సహాయం అర్హులందరికీ అందలేదని, వెంటనే మిగిలిన వారికి మంజూరు చేయాలని కోరారు. మండల కేంద్రాలు, మున్సిపల్ ప్రాంతాల్లో నాయి బ్రాహ్మణులకు దుకాణ స్థలాలు, షెడ్లు కేటాయించి జీవనోపాధికి సహకరించాలని అన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో సంఘానికి ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి కనీసం 200 గజాల స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా, నాయి బ్రాహ్మణుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలను పట్టించుకోకపోతే దశలవారీగా ఆందోళనలను విస్తరించి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు రాచకొండ శ్రీనివాసరావు, దడిగాల మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అరసవిల్లి వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.



# ఫీజుల రియంబర్స్మెంట్ పథకం రద్దుకు కుట్ర

**-నీల నాగరాజు బీసీ విద్యార్థి సంఘం కామారెడ్డిజిల్లా అధ్యక్షులు**

కామారెడ్డి ,ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నీల నాగరాజు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఫీజుల బకాయిలు పూర్తిగా విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు కోర్టుకు వెళ్లారు.ప్రభుత్వం ఫీజులు ఇవ్వకపోతే కాలేజీ యజమాన్యాలు విద్యార్థుల నుండే ఫీజులు వసూలు చేసుకోవచ్చు అని హైకోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది.పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేని ఆర్థిక స్తోమత లేనందునే ఫీజుల రియంబర్స్మెంట్ పథకం తీసుకరావడం జరిగింది. కానీ హైకోర్టు తీర్పుతో పేద విద్యార్థులకు ఉన్నత చదువులు గుదిబండగా మారనున్నాయి. ఫీజులు రియంబర్స్మెంట్ నిదులు విడుదలపై సీఎం తక్షణమే స్పందించాలి. ఫీజులు రియంబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయకపోతే బిసీ మంత్రులు రాజీనామా చేయాలి. పీజుల స్కీమ్ ను రద్దు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయం. గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీ విద్యార్థుల ఉన్నత చదువుకు భరోసా కల్పించడానికి 2008 లో గత కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తో పోరాడి,ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని సాధించుకున్న మని,తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గత టిఆర్ఎస్ ప్రభుత్వం నుండి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు సంపాదించుకున్న ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని నీరుగారుస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల విషయంలో గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే తెలంగాణ రాష్ట్రంలోనే తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఎమ్మెల్యే సీటు నుండి మొదలుకొని సీఎం సీటు వరకు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు ఏలుతున్నారని, బీసీలకు కనీసం చదువుకోడానికి కూడా అవకాశం కల్పించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారనీ, వేలాదిమంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఉన్నత విద్యకు దూరం అవుతున్నారన్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూనే, ఇంకొక వైపు ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తుందన్నారు, ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాల యజమాన్యాలు ఇటీవల హైకోర్టును ఆశ్రయించడంతో నిన్న హైకోర్టు విచారించి ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయకపోతే విద్యార్థుల నుండే అడ్మిషన్ల సమయంలో కాలేజీలు ఫీజులు వసూలు చేసుకోవచ్చని, ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత విద్యార్థులకు ఆ పీజు డబ్బులు తిరిగి విద్యార్థుల కు ఇవ్వాలని తీర్పు ఇచ్చిందన్నారు, ఈ తీర్పు పేద విద్యార్థుల ఉన్నత చదువులకు గుదిబండలా మారుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు బీసీలను తీవ్ర గందరగోళంలోకి నెట్టివేసిందని, రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే



హైకోర్టు తీర్పుపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క స్పందించి ఫీజుల రియంబర్స్మెంట్ విషయంలో ప్రభుత్వ వైఖరి నీ స్పష్టంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇంత అన్యాయం తల పెడుతున్న మౌనంగా చూస్తూ కూర్చున్న బీసీ మంత్రులు తమ పదవులకు తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు బీసీల ప్రయోజనాలకు పాటుపడని పదవులు ఎందుకని ఆయన ప్రశ్నించారు బీసీ బిడ్డలుగా రాజీనామా చేసి ఫీజులు ఇవ్వకుండా, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా బీసీలపై నిర్లక్ష్యం వహిస్తున్న అగ్రకుల కాంగ్రెస్ ప్రభుత్వం పై తిరగబడాలని అన్నారు. హైకోరు తీర్పు దరిమిల ఫీజుల రియంబర్స్మెంట్ పథకాన్ని రక్షించుకోవడం కోసం బీసీ సమాజం పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి రాజేందర్, ప్రశాంత్, సాత్విక్, హరికృష్ణ, గణేష్, రాము, వినయ్, కృష్ణ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# గీతా జ్ఞానం ప్రపంచంలోని ప్రతి ఒక్కరికి అవసరం

**-పాఠశాల స్థాయి నుండి గీతా జ్ఞానాన్ని విద్యార్థులకు నేర్పించాలి**

కామారెడ్డి , ఏప్రిల్ 7, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఐవిఎఫ్ కామారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో కల్కి ఆలయంలో భగవద్గీత పారాయణ మహా యజ్ఞంలో భాగంగా సంపూర్ణ భగవద్గీత 18 అధ్యాయనాలు,700 ల లను కంఠస్థం చేసి శ్రీ గీతా పరివార్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన భగవద్గీత పోటీ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించిన 13 మందికి సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు,జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ మాట్లాడుతూ భగవద్గీత జ్ఞానం ప్రతి ఒక్కరికి అవసరమే అని మానవుడు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం దీని ద్వారా లభిస్తుందని, ఉన్నత విలువలతో కూడుకున్న వ్యక్తుల నిర్మాణం జరగాలంటే ప్రతి ఒక్కరూ భగవద్గీత పట్టణం చేయాలని అన్నారు కామారెడ్డి జిల్లా కేంద్రంలో 13 మంది భగవద్గీత పరీక్షల్లో బంగారు పతకాలు సాధించడం దేశానికే గర్వకారణమని అన్నారు, ప్రతి పాఠశాలలో భగవద్గీత శ్లోకాలను విద్యార్థులకు నేర్పించే విధంగా ప్రభుత్వము చర్యలు తీసుకోవాలని కోరారు. సన్మాన గ్రహీతలు డాక్టర్ రాధా విజయలక్ష్మి దేవరకొండ, నంగునూరు సులోచన,లీలావతి రాజు, అందె శ్రీదేవి, పడిగల రమాదేవి,దువ్వల మమత,



దువ్వల కుశాల్, యేల్లంకి పల్లవి, దోమకొండ ప్రేమలత, పార్శి విజయ్, లాబిశెట్టి పద్మ, బార్ల రాధ, బార్ల ఆర్య లను పూలమాల శాలువా, ప్రశంస పురస్కారంతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సహకరించిన కొవూరి భూమేష్ రమ దంపతులకు ఐవిఎఫ్ తరపున అభినందనలు తెలియజేశారు. ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోశాధికారి దొంతి సుధాకర్, కస్వ వెంకన్న లు మాట్లాడుతూ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని సామాజిక సేవతోనే మానవ జీవితానికి సార్థకత చేకూరుతుందని భావనను సమాజానికి అందజేస్తున్నామని వైశ్యులకే కాకుండా సమాజంలో ఉన్న అన్ని వర్గాల అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ మహిళా విభాగం బుక్క రజని, చిలువేరి శ్రీదేవి, కస్వ లలిత, దొంతి అర్చన, శనిశెట్టి పద్మ శ్రీనివాస్, ఆధ్యాత్మిక విభాగం ఎల్లంకి సుదర్శన్,ఎర్రం విజయ్ కుమార్, నంగునూరి కాశీనాథం, యువజన విభాగం ఎర్రం ఈశ్వర్ ఐవిఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రింకింగ్ వాటర్ మానిటరింగ్ సెల్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**-టోల్ ఫ్రీ నంబర్ 9908712421**

కామారెడ్డి, ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా జిల్లా కలెక్టరేట్‌లోని రూమ్ నెం. 25లో ఏర్పాటు చేసిన డ్రింకింగ్ వాటర్ మానిటరింగ్ సెల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారంరిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తిన పక్షంలో ప్రజలు వెంటనే స్పందించేందుకు ఈ మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సెల్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్ 9908712421 ను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా త్రాగునీటి సమస్యలు ఉన్న యెడల ప్రజలు ఈ నంబర్‌కు సంప్రదించి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. ఈ మానిటరింగ్ సెల్ తేది :07.04.2026 నుండి తేది : 30.06.2026 వరకు పని చేస్తుందని, ప్రతి రోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని త్రాగునీటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.



ఇందులో ఇండస్ట్రీ ఆఫీసర్ లాలు, ఎస్సీకార్పొరేషన్ వెంకటశ్వర్లు, డిఎల్పి శ్రీనివాస్, మెప్మా శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని అద్దంకి నార్కెట్పల్లి హైవేపై రైతుల రాస్తారోకో

మిర్యాలగూడ ప్రతినిధిఏప్రిల్ 7:(తెలంగాణ పత్రిక)

నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గం లోని వేములపల్లి మండలంలో దాన్యం కొనుగోలు చేయాలని రైతులు అద్దంకి నార్కెట్ పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం రైస్ మిల్లుల దగ్గర మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం లేదనడంతో రైతులందరూ కలిసి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నల్గొండ రోడ్డు మీద రాస్తారోకో నిర్వహించారు. రైస్ మిల్లర్స్ స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసు, డిఎస్పి రాజశేఖర్ రాజు, సమావేశం నిర్వహించి రైతులకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. రైతులకు రైస్ మిల్లులకు మధ్య సోమవారం జరిగిన వాగ్దానం కారణంగా మిల్లర్లు కొనుగోలు నిలిపివేశారు. దాంతో రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని ఆందోళన



నిర్వహించారు. కాగా అధికారులు ప్రజాప్రతినిధులు చర్చలు నిర్వహించగా మంగళవారం కొనుగోలు తిరిగి ప్రారంభించారు.

## మండల కేంద్రంలో టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం



గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం రోజున ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా టీబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రోగ్రాం హైరిస్క్ గ్రామాలలో ఎక్స్ రె కార్యక్రమం జిల్లా కలెక్టర్ గారిమా అగర్వాల్ జిల్లా వైద్యాధికారిని డాక్టర్ రజిత ఆదేశానుసారం డాక్టర్ అభినయ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించారు మంగళవారం రోజున మొత్తం 95 మంది హైరిస్క్ వాళ్లకి ఎక్స్ రె తీశారు ఈ కార్యక్రమంలో స్థానిక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లుగారి పద్మ ఉపసర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి మాజీ సర్పంచ్ అక్క పెల్లి బాలయ్య సిహెచ్ఓ రమేష్, టీబి సూపర్వైసర్స్ మహిపాల్, గంగాధర్, ఎక్రే టెక్నీషియన్ బాలు ఎం.ఎల్ హెచ్ పిఎస్ ఏఎన్ఎంఎస్ ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు రాములవారి తలంబ్రాలు ,తీర్థప్రసాదాలు అందజేసిన కాంగ్రెస్ నాయకులు



వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 7 ( తెలంగాణ పత్రిక).

తెలంగాణవిప్, ఎమ్మెల్సీ డా. వెంకట్ బల్మూర్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, అపరభద్రద్రి గా ప్రసిద్ధి పొందిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం సందర్భంగా ఇవ్వబడిన తలంబ్రాలు , తీర్థ ప్రసాదాలు స్వామి వారి చిత్రపటం అందజేసి శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో వీణవంక మాజీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ రెడ్డి , యువజన నాయకులు రంజిత్ రెడ్డి, అనిల్ రెడ్డి, బాబాజీ, నాగరాజు, మద్ది కిషోర్ పాల్గొన్నారు.

## ఆర్చరీ కాంపిటీషన్లో నేషనల్ లో మెరిసిన వల్బాపూర్ బిడ్డ షన్విత



**-అభినందించిన అతిధి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి**

వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 7( తెలంగాణ పత్రిక).

వీణవంక మండలం వల్బా పూర్ గ్రామనికిచెందిన నామని శ్రీనివాస్ -అనిత దంపతుల కూతురు శాన్విత ఆర్చరీ నేషనల్ కాంపిటీషన్లో మెరిసిన తెలంగాణా తేజం.గత నెల మార్చ్ 26 నుండి నంబూరు వి వి ఐ టి కాలేజీ నందు జరుగుతున్నా వోల్గా నేషనల్ ఆర్చరీ ఛాంపియన్షిప్ పోటీలో ఏప్రిల్ 4 న తెలంగాణా నుండి షన్విత అనే బాలిక బ్రాంజ్ మెడల్ సాధించింది. చిన్న వయసు నుండి ఆర్చరీలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తున్న షన్విత జాతీయ స్థాయిలో పలు పోటిల్లో ప్రతిభ కనబరుస్తూ వస్తుంది. తాను జాతీయ స్థాయిలో పలు పోటిల్లో పాల్గొని , ఈ మెడల్ సాధించటం వెనక తన కృషితో పాటు తన తండ్రి శ్రీనివాస్ ప్రోత్సాహం, అనుక్షణం వెన్నంటి ఉండి అన్ని విధాలా సహకరించటం వలెనే సాధ్యమైందని షన్విత పేర్కొవటం విశేషం. నేషనల్ గేమ్స్ కి ఆఖరి రోజైన నేడు సింగిల్స్ లో పాల్గొని హైదరాబాద్ తిరిగి వచ్చిన షన్వితకు, తన తల్లిదండ్రులు శ్రీనివాస్ దంపతులకు అతిధి డెవలపర్స్ అధినేత కొమ్మిడి రాకేష్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. షన్విత మాట్లాడుతూ..రానున్న కాలం లో ప్రభుత్వం మరింత ప్రోత్సహం కలిపించినట్లతే ఓలంపిక్ వరకు వెళ్లి తెలంగాణ రాష్ట్ర కీర్తిని మరింత బలోపేతం చేసేవిధంగా కష్టపడతానన్నారు.

## ఉపాధి హామీ కూలీల వేతనాలు వెంటనే ఇవ్వాలి

-సీపీఎం మండల కన్వీనర్ పిల్లి రవి యాదవ్..



వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 7( తెలంగాణ పత్రిక)

గత 3 నెలలుగా పెండింగ్ లో ఉన్న ఉన్న కూలి డబ్బులు వెంటనే విడుదల సీపీఎం మండల కన్వీనర్ పిల్లి రవి యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్బాక గ్రామ ఉపాధి కార్మిలు పని ప్రదేశం లో సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫోటోలు సరిగా అప్లోడ్ కావడం పెద్ద సమస్యగా మారింది .చాలా మంది కార్మికులు ఫోటోలు క్యాప్చర్ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలంలో పని ప్రదేశాల్లో త్రాగునీరు, చలవ టెంట్లు, కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఉపాధి హామీ కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## పోతిరెడ్డిపల్లి లో చలివేంద్రం ప్రారంభించిన గ్రామ ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య



వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 7 ( తెలంగాణ పత్రిక).

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎండ తీవ్రతలో భాగంగా బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, పబ్బు సులోచన, ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య ముఖ్య అతిథులుగా హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ వేసవికాలంలో వాహనదారులు కానీ గ్రామ ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన వచ్చే పోయే వాహనాలు చలివేంద్రాన్ని చదివినియోగం చేసుకోవాలని కోరారు..ఈ కార్యక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి సుష్మ, మంచినీటి దాత పానుగంటి సులోచన, సమ్మయ్య బాలవికాస సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట క్షేత్ర సందర్శన

సదాశివనగర్, ఏప్రిల్ 7(తెలంగాణ పత్రిక):



సదాశివనగర్ మండలం యాచారం తండాలో రైతు రమేష్ సాగు చేసిన యాగంటి ఆగ్రోటేక్ భారతి కంపెనీ ఆధ్వర్యంలో మొక్కజొన్న 3699రకంపై రైతు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధిక దిగుబడినిచ్చే ఈ వంగడం గురించి రైతులకు వివరించారు.కంపెనీ ప్రతినిధి ఆర్ఎం మధు మోహన్ రావు మాట్లాడుతూభారతీ మొక్కజొన్న వంగడం ఇతర రకాలతో పోలిస్తే అధిక దిగుబడినిస్తుందని,దీని వేరు వ్యవస్థ దృఢంగా ఉండి,గింజ బరువుగా ఉంటుందని వివరించారు.భారతీ సీడ్స్ విత్తనాలు రైతులకు మంచి లాభాలను చేకూరుస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ సిడ్స్ డీలర్ విజయ్,సర్పంచ్ గణేష్, భారతీ కంపెనీ ప్రతినిధి వీరన్న,రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

కామారెడ్డి, ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డిజిల్లా రవాణా అధికారి జె. శ్రీనివాస్ ఆదేశాల మేరకు, బొర్లం రెసిడెన్షియల్ బాలికల పాఠశాల నందు మంగళవారం రోడ్డు భద్రత , మాదకద్రవ్యాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య అద్వర్యం లో జరగిన. ఈ కార్యక్రమానికి రవాణా శాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సహాయక మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ మధుకర్ గారు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "ప్రతి ఒక్క విద్యార్థి విధిగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలి. నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి" అని సూచించారు. అలాగే వారు మాట్లాడుతు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే బిఎల్ఆర్





మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 7:(తెలంగాణ పత్రిక)

పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మిర్యాలగూడ శాసనసభ్యులు భత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం కోడె బండ తండా కి చెందిన లబ్ది దారుల భూక్యా బిక్షం - రోజా నూతన ఇందిరమ్మ ఇళ్ళు లు శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు వారి కుటుంబ సభ్యులు ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనా రెండున్నర సంవత్సరాలలో మన మిర్యాలగూడ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేద కుటుంబాల సొంత ఇంటి కలను నెరవేర్చాము అని అన్నారు. అతి త్వరలోనే మిర్యాలగూడ పట్టణంలో కూడా 2500 ఇళ్లకు శ్రీకారం చుట్టబోతున్నాము అని అన్నారు. గత ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమం పక్కకు పెట్టి కమిషన్ ల కోసం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసింది అని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలకు సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక సంక్షేమాలను పేద ప్రజలకు అందించి వారి ఆశీర్వాదాలు అందుకుంటున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ బేసిక్ కింద పనిచేస్తున్న ఆరుగురు శానిటేషన్ కార్మికుల తొలగింపు

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరోజినీ కాంట్రాక్ట్ బేసిక్ కింద 12 మంది కార్మికులను గత నాలుగు సంవత్సరాల క్రితం పనిలోకి తీసుకొని వారికి ఏలాంటి సమాచారం ఇవ్వకుండా ఆరుగురిని శానిటేషన్ కార్మికులను విధుల నుండి తొలగించారు పనిచేసే వ్యక్తులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా తీసివేస్తారంటూ వారు ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన వ్యక్తం చేస్తూ తక్షణమే గవర్నమెంట్ ఆరుగురిని తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వారు జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు మాకు తక్షణమే హాస్పిటల్లో పని కల్పించాలన కోరారు ఇట్టి విషయంపై సంబంధిత మండల వైద్యాధికారి సృజన్ కుమార్ వివరణ కోరగా శానిటేషన్ సిబ్బందితో మాకు ఎలాంటి సంబంధం లేదని అట్టి విషయం సరోజిని కాంట్రాక్టర్ కు సంబంధించిన విషయం అని తెలిపారు గతంలో 30 పడకల ఆసుపత్రికి శానిటేషన్ కింద పన్నెండు మందిని విధుల్లోకి తీసుకోగా అందులో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 15 పడగల ఆసుపత్రిగా ఉండడం 30 పడకలు రద్దు కావడంతో ఆరుగురిని తీసుకోవాలని కాంట్రాక్టర్ కు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వగా ఆరుగురిని వీధుల్లోకి రావాలని తెలుపగా మిగతా ఆరుగురిని విధుల్లో తీసేసినట్లు తెలిపారు . ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుండి సరోజిని కాంట్రాక్ట్ కింద 12 మందిని శానిటేషన్ కింద విధుల్లోకి తీసుకొని గంభీరావుపేట వాస్తవ్యులుగా ముగ్గురిని తీసుకోగా 9 మంది చుట్టుపక్క గ్రామాల నుండి విధుల్లో కాంట్రాక్టర్ తీసుకున్నాడని. గ్రామానికి సంబంధించిన ఆ ముగ్గురు వ్యక్తులను తీసేయడానికి ఏమిటని కాంట్రాక్టర్ ను కార్మికులు నిలదీశారు అలాగే గత పది నెలల వేతనాలు ఇవ్వలేదని తెలిపారు సంబంధిత కాంట్రాక్టర్ మాకు విధుల్లోకి తీసుకొని పది నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తక్షణమే తమను పనిలోకి తీసుకోవాలని కోరారు.

## పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రత్యేక నమోదు కార్యక్రమం

వెల్దుర్తిమండల ప్రతినిధి, ఏప్రిల్ 07 (తెలంగాణ పత్రిక)





వెల్దుర్తి పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని మంగళవారం మండల పరిధి హస్తాల్పూర్ గ్రామంలో కొనసాగింది. బడిబాట కార్యక్రమంలో భాగంగా హస్తాల్పూర్ గ్రామం నుంచి పరిసర ప్రాంతాల్లో గల పలు ప్రైవేటు పాఠశాలకు వెళ్లి చదువుతున్న 6 తరగతి నుంచి 10 తరగతి వరకు విద్యార్థులను గుర్తించి వారి ఇండ్లకు ప్రత్యక్షంగా వెళ్లి తల్లిదండ్రులతో ఉపాధ్యాయ బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామ ప్రజాప్రతినిధులతో కలిసి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించి తమ పిల్లలను వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు తోడ్పడాలని సూచించారు. సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాల కంటే మెరుగైన సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ సౌకర్యం నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాల కోసం పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని పిలుపునిచ్చారు. వెంటనే స్పందించిన తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై ఉన్న వ్యామోహం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వచ్చే సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తామని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య మాట్లాడారు. గ్రామస్తులు యువకులు కలిసి సమాజ భాగస్వామ్యంతో పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయగలరని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాల నిరంతరం ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, నవనీత, సునీత, మహేష్, పాల్గొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం వరల్డ్ హెల్త్ డే అసలు నిజం ఇదే



భిక్కనూరు ఏప్రిల్ 07 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా డాక్టర్ యేమిమ ఆశా కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు,అనంతరం హాస్పిటల్ లో ఆశాకార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా డాక్టర్ యేమిమ మాట్లాడుతూ అసలు ఏంటి వరల్డ్ హెల్త్ డే? ప్రపంచ ఆరోగ్య సంస్థ డెఫినేషన్ ప్రకారం ఆరోగ్యం అంటే కేవలం మనకు రోగాలు లేకపోవడం కాదు, శారీరక,మానసిక,సామాజిక ఆనందాల కలయికే సంపూర్ణ ఆరోగ్యం.ప్రస్తుతం కాలంలో చాలామంది దయాబెటిస్,బిపి, హార్ట్ ప్రాబ్లమ్స్ తదితర రోగాల బారిన పడుతున్నారని తెలిపారు,రెగ్యులర్ గా హెల్త్ చెకప్ లు చాలా ముఖ్యం, ఆరోగ్యకరమైన జీవన విధానంలో తాజా కూరగాయలు,పండ్లు తీసుకుంటూ,యోగ లాంటి ఫిజికల్ యాక్టివిటీస్ చేయాలని తెలిపారు,డిజిటల్ స్క్రీన్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చి,కంటినిండా ఎనిమిది గంటలు నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం వలన ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ సిబ్బంది సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న సిఏ పోస్టును వెంటనే భర్తీ చేయాలి

-బిజెపి మండల అధ్యక్షులు కోడె రమేష్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మండల అధ్యక్షులు కోడె రమేశ్ మాట్లాడుతూ నర్మాల గ్రామానికి సంబంధించి మహిళా గ్రూపు సిఏ ఒక ప్రత్యేక పరిస్థితుల్లో రాజీనామా చేసి 4 నెలలు గడుస్తున్న నేటి వరకు కూడా ఉద్యోగం భర్తీ చేయకపోవడం శోచనీయం గత.కొన్ని రోజుల క్రితం నియామకానికి తేదీలను ప్రకటించి రద్దు చేయడంతో పలు అనుమానాలకు దారి తీస్తుంది ఇప్పటి వరకు ఎవరిని నియమించకపోవడం అధికారుల వైఫల్యంగా భావించడమే కాకుండా పలు అనుమానాలకు దారితీస్తుందన్నారు పరీక్ష నిర్వహించి నేటి వరకు నియమించకపోవడం తో ఎవరి ప్రలోభాలకు తలోగ్గి ఎంపిక రద్దు చేయాల్సి వచ్చిందో సంబంధిత బాధ్యత గల అధికారులు వెంటనే తెలపాలి డిమాండ్ చేశారు. అధికారులు తమ సొంత లాభాలు కోసం అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం వారి యొక్క అడుగులకు మడుగులొత్తడానికే జాప్యం చేస్తున్నారన్నారు సీఏ ఉద్యోగ నియామకంలో అర్హులైన వారిని వెంటనే నియమించాలని లేనియెడల ఏపీఎం ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మలేష్ యాదవ్ విగ్నేష్ గౌడ్ ఉపాధ్యక్షులు నర్సింలు స్వామి దేవేందర్ యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

# పెద్ద గూడూరు మండలాన్ని నియోజకవర్గం చేయాలని ధర్నా

**-డిఎస్ఎఫ్ఐ. మండల ఇన్చార్జి బానోత్ దేవేందర్ ఆధ్వర్యంలో**

**-నియోజకవర్గ చేసేంతవరకు డిఎస్ఎఫ్ఐ. నిరంతర ఉద్యమం**

పెద్దగూడూరు/కొత్తగూడ/గంగారం:-ఏప్రిల్07.(తెలంగాణపత్రిక)

మహబూబాబాద్ జిల్లా, నూతన నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా గూడూరు మండల కేంద్రాన్ని నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిఎస్ఎఫ్ఐ. ఆధ్వర్యంలో, అంబేద్కర్ సెంటర్లో మండల ఇన్చార్జి బానోతు దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండలం లో అత్యధికంగా ఆదివాసి, గిరిజనులు, గిరిజనేతర ప్రజలు ఉన్నారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగ బద్ధంగా గూడూరు ప్రాంతాన్ని షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తించారని అన్నారు. అప్పటి నుండి నేటి వరకు గిరిజన చట్టాలను ప్రభుత్వ అధికారికంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గూడూరు మండల విస్తీర్ణం 41 గ్రామ పంచాయతీ లలో సుమారు 70 వేల మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. అందులో 70% వరకు ఆదివాసి, గిరిజనులు ఉన్నారని, మరో 30 శాతం మంది గిరిజనేతర ప్రజలు ఉన్నారని స్పష్టం చేశారు. మహబూబాబాద్ నియోజక వర్గ కేంద్రానికి 30 కిలోమీటర్లు, నర్సంపేట నియోజక వర్గం కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో గూడూరు మండల కేంద్రం




ఉందన్నారు. గతంలో 1909 నుండి గూడూరు పాత తాలూకా కేంద్రం, అదే మాదిరిగా గూడూరు సమితిగా కూడా ఉండేదని, గూడూరును కేంద్ర బిందువు గా చేసుకొని, అప్పటి ప్రభుత్వ యంత్రాంగం ప్రజాపాలనను కొనసాగించారని తెలిపారు. గూడూరులో అపారమైన ఖనిజ వనరులు, అడవులు ఉన్నాయని వివరించారు. గూడూరు మండల కేంద్రంలో పోలీస్ సర్కిల్ కార్యాలయం, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయం, అటవీ శాఖ సబ్ డివిజన్ కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యు ఎస్ డివిజనల్ ఇంజనీరింగ్, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డీలిమిటేషన్ లో భాగంగా, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. దీనికి అనుకూలంగా గూడూరు మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని, ప్రత్యక్ష డిమాండ్ తో ప్రజా, విద్యార్థి ఉద్యమాలను నిర్వహిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, గూడూరు మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రం గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, శ్రీకాంత్, అంజన్న, వాసు, బాలాజీ, వెంకటేష్, వీరన్న, చరణ్, మోహన్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు పేద విద్యార్థుల చదువులకు తీవ్ర నష్టం

**-ప్రభుత్వ హామీలతో కళాశాలలు విద్యార్థులను చేర్చుకున్నారు.**

**-ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు.**

**-ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్ నాయక్**

మిర్యాలగూడ ప్రతినిధి//ఏప్రిల్ 7:(తెలంగాణ పత్రిక):-

ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు పేద విద్యార్థులు చదువులకు తీవ్ర నష్టం,ప్రభుత్వ హామీలతో కళాశాలలు విద్యార్థులను చేర్చుకున్నారు, ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదాని ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ముడావత్ జగన్ నాయక్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ డివిజన్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం లో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఫీజు బకాయిలపై ఇచ్చిన తీర్పులో విద్యార్థుల నుండి వసూళ్లు చేసుకోని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని తీర్పు సరైనది కాదని ఇది విద్యార్థుల చదువుల అభివృద్ధికి గొడలిపెట్టని హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చేయాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది అని అన్నారు. ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని అలాంటిది ప్రైవేటు యాజమాన్యాల బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వకుండా విద్యార్థుల నుండి వసూళ్లు చేసుకోండి అనే తీర్పు సరైనది కాదు. అణాగారిన వర్గాలు నుండి ఇప్పుడే ఉన్నత విద్యలోకి వస్తున్న ప్రధానంగా ఈ ఫీజులు పొందే వారు పేద విద్యార్థులు వారిలో రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బి.సి. ,మైనారిటీ విద్యార్థులలే ఈ పథకం కింద లబ్ది పొందుతున్నారని వారిని ఈ తీర్పు వల్లన మరింత వేధింపులు గురి అవుతారని ఎస్ఎఫ్ఐ పేర్కొంది, రాష్ట్రంలో ప్రైవేటు యాజమాన్యాలు ఫీజులు బకాయిలు రావడం లేదని పేద విద్యార్థుల సర్టిఫికేట్స్ ఇవ్వకుండా వేధింపులు గురి చేస్తున్నారని, దీని వల్ల గతంలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా



చేసుకున్నారని తెలిపారు, ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ఫీజు రీయంబర్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ కోరుతుంది, హైకోర్టు తీర్పును పునఃసమీక్ష చాలా చేయాలని, ప్రభుత్వానికి తక్షణమే ఫీజుల విడుదల కోసం ఆదేశాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తోంది.

# రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి -సిఐటియు

తెలంగాణ పత్రిక దమ్మపేట ఏప్రిల్ 7

దమ్మపేట :- రైతంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈనెల 23 నుండి కొత్తగూడెంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడో మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ కోరారు. రైతు సంఘం మహాసభలు విజయవంతం కొరకు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నెమలిపేట, అర్బన్ కాలనీలలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటూ మహాసభల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ కోట్లాదిమందికి అన్నం పెట్టే రైతన్న నేడు అనేక కష్టాల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రైతాంగ ఆత్మహత్యలకు కారణం పాలకులు అవలంబిస్తున్న వ్యవసాయ, రైతు వ్యతిరేక విధానాలు అని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ట్రంపు డిమాండ్లకు తలవొగ్గి వ్యవసాయక ఎగుమతి దిగుమతి సుంకాలను ట్రంపు అనుకూలంగా మార్చడం వలన వ్యవసాయ రంగం పెను ప్రమాదానికి గురైందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ రైతులకు ఇచ్చిన హామీలు రైతు భరోసా నిధులు కానీ,రుణమాఫీ కానీ, వడ్లకు సబ్సిడీ గానీ పూర్తిస్థాయిలో ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో అమలు చేయలేదని అన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు అఖిలభారత నాయకులు అశోకు తావులే, విజ్జు కృష్ణన్ హాజరుకానున్నారని మహాసభల మొదటి రోజు



వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, రామకృష్ణ, ఈశ్వరమ్మ, సత్యవతి, విజయలక్ష్మి, యశోద, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



మంగళవారం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయం నందు, కొత్తగూడెం ఏరియా హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జిఎం శాలేంరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని మొదటి ప్రాధాన్యంగా తీసుకొని, మంచి ఆహారం, వ్యాయామం, పరిశుభ్రతను అలవాటుగా మార్చుకుంటేనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని,ఆరోగ్యం బాగుంటేనే సంస్థ బాగుంటుందని సూచించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత కుమారి మాట్లాడుతూ, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి పోషకాహారం తీసుకోవాలని, నిత్యం వ్యాయామం చేయడం, సమయానికి నిద్రపోవడం వంటి మంచి అలవాట్లు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలేం రాజు ఎస్.ఓ. టు జీఎం కోటి రెడ్డి ఏజీఎం (పర్సనల్) జి.వి. మోహన్‌రావు ఏజీఎం (ఫైనాన్స్ ) బీభత్సా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత కుమారి రుద్రంపూర్ డిస్పెన్సరీ సూపరింటెండెంట్ డాక్టర్ పరశు రామ్ ఇతర అధికారులు, జిఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన ఆర్డీవో రమాదేవి

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట తెలంగాణ పత్రిక, ఏప్రిల్ 7



ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా చిన్న శంకరం పేట మండల కేంద్రంలోని మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సందర్శించారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మండల కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం రేషన్ డీలర్ షాపును సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి అవకతవకులు పాల్పడకూడదని హెచ్చరించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేని శరీర సామాజిక సంక్షేమం కలిపిన సమగ్ర స్థితి అని చెప్పారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాలతీ, ఆర్ఐ రాజు, వైద్యాధికారి సాయి సింధు, ఎంపీడీవో దామోదర్, తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రియుడు ఇంటిముందు బైఠాయించి ప్రియురాలి మౌన పోరాటం

**-చావనైనా చస్తాను గానీ ఇక్కడ నుండి కదిలే ప్రసక్తేలేదంటున్న ప్రియురాలు**



పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- ఏప్రిల్ 07. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని గుండెంగ గ్రామ శివారు వాగ్య తండాలో, ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు బైటాయించిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ప్రకారం ఇలా ఉన్నాయి. కేసముద్రం మండలం రేకుల తండాకు చెందిన, ఓ యువతి గుండెంగ గ్రామ శివారు వాగ్యతండాకు చెందిన తేజావత్ రఘురాం అనే యువకుడు వీరిద్దరూ గత ఏడు సంవత్సరాలు గా ప్రేమించుకున్నట్టుగా తెలిపారు. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి పెళ్లి చేసుకోకపోవడంతో ఇంటి ముందు బైటాయించి మౌన పోరాటం చేస్తున్నట్లు పలువురు తండావాసులు తెలిపారు. ఈ మౌన పోరాటం ఎన్నాళ్లు జరుగుతుందో?, ఈ సమస్యకు పరిష్కారం చూపేదెవరు?. ప్రియురాలు, ప్రియుడి వివాహం జరుగుతుందా?, అంతం కాదు ఇది ఆరంభం ల కొనసాగుతుందా? వేచి చూడాల్సిందే అంటున్న గ్రామస్తులు.

## దమ్మపేటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు


దమ్మపేట, ఏప్రిల్ 07, తెలంగాణ పత్రిక



దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలో పలు డ్రైనేజీలో చెత్త, చెదారం పేరుకుపోయి మురికి కాల్వల్లో దుర్వాసన వెదజల్లుతుంది అని గ్రామస్తులు సర్పంచ్, వార్డు సభ్యులకు ఫిర్యాదు చేశారు. తదనుగుణంగా పారిశుధ్య పనులను గత రెండు వారాలుగా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మురికి కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని తొలగించే పనులు చేపడుతున్నారు. ఇండ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి డ్రైన్లు తీయిస్తున్నారు. డ్రెయిన్లలో ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని దించి శుభ్రం చేయిస్తున్నారు. అదేవిధంగా చెత్తా చెదారాన్ని ఇంటింటా తిరుగుతూ సేకరించి వాహనంలో తరలిస్తున్నారు. ప్రజలు ఇండ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి అంటూ పారిశుధ్య సిబ్బందికి సహకరించాలి అని మంగళవారం ప్రజలకు పాలక వర్గ సభ్యులు అవగాహన కల్గిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, గ్రామస్తులు పగడాల రాంబాబు, పంచాయతీ సిబ్బంది కుప్పాల విజయ్, కొప్పర్తి సింగ్, మహాదేవ సాయి, నల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కో- ఆప్షన్ సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్

చండూరు తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



చండూరు మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న నాలుగు కో-ఆప్షన్ సభ్యుల పదవుల భర్తీ కి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం అనుభవం కలిగి ఉన్న ఇద్దరు సభ్యులను (ఒక మహిళా) అల్ప సంఖ్యాక వర్గమునకు చెందిన ఇద్దరు (ఒక మహిళ సభ్యులై ఉండాలి) స్థానిక ఓటర్ జాబితాలో పేరు కలిగి ఉండాలని అధికారులు తెలిపారు.

## మల్లారెడ్డిపేటలో ప్రజా బాట కార్యక్రమం



గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎన్ పి డీసీఎల్ ఏ ఈ ఆనంద్ కుమార్ హాజరై ఎస్ ఎస్ 30 సందర్శించి గ్రామంలోని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్ర సాయిలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ అమరేందర్ లైన్ మెన్ కర్నాల సత్యం తోపాటు విద్యుత్ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో గృహ జాబితా బ్లాకుల సృష్టిపై జిల్లా కలెక్టర్ సమీక్ష



కామారెడ్డి ,ఏప్రిల్ 7, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాలో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి జిల్లా కలెక్టర్ గృహ జాబితా బ్లాకుల సృష్టి పురోగతిపై మంగళవారంసమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న హెచ్ ఎల్ బిల తయారీ పనుల ప్రగతిని సమగ్రంగా పరిశీలించారు. సమావేశంలో కలెక్టర్ సెన్సస్ క్లర్కులు సాంకేతిక సహాయకులకు కీలక సూచనలు చేశారు. గృహ జాబితా బ్లాకుల సృష్టిలో ఖచ్చితత్వం, సమగ్రత పాటించాలన్నారు. ప్రతి ఎణ్యూమరేటర్‌కు సమానంగా పని పంపిణీ జరగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనిలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మధుమోహన్, డి.వి. రమణ , శివకుమార్ , స్టాటిస్టికల్ అధికారి, సెన్సస్ సూపరింటెండెంట్ అనిల్ పాల్గొన్నారు.

## 8న కలెక్టరేట్లో సురక్షిత మాతృత్వం పై వర్క్ షాప్




కామారెడ్డి, ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆరోగ్య వారోత్స వాళ్ల ససందర్భంగా 8 కలెక్టరేట్కామారెడ్డి లో సురక్షిత మాతృత్వం చట్టం పై వర్క్‌షాప్ నిర్వహించడానికి నిర్ణయించబడింది. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. కార్యక్రమంలో హాజరుకావడానికి ఆహ్వానించబడినవారు: పోలీస్ శాఖ, విద్యాశాఖ, వైద్యశాఖ, టి డి డబ్ల్యుసిబ్బంది, సంఘాల సిబ్బంది అధికారులు, సభ్యులు మెడికల్ కాలేజ్ విద్యార్థులు ప్రైవేట్ హాస్పిటల్, స్కానింగ్ సెంటర్ల ప్రతినిధులు ఐఎంఏఅధ్యక్షులు, కార్యదర్శులు రెడ్ క్రాస్ సొసైటీ రోటరీ క్లబ్ చైర్మన్లు, కార్యదర్శులు అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు గైనకాలజిస్టులు, ఎన్జీవో సభ్యులు, సఖి స్వచ్ఛంద సంస్థ సభ్యులు హాజరవుతారని డి ఎం హెచ్ ఓడాక్టర్ డి రవీందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పాకాల కొత్తగూడెంలో అరుణోదయ ఏడవ మహబూబాబాద్ జిల్లా మహాసభ

-సభకు ముస్తాబవుతున్న కొత్తగూడ పాలడుగు కృష్ణన్న భవన్

-సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మహబూబాద్ జిల్లా నాయకుడు కామ్రేడ్ పుల్లన్న

పెద్ద గూడూరు/ కొత్తగూడ/ గంగారం:- ఏప్రిల్ 07. (తెలంగాణ పత్రిక ప్రతినిధి)



మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండలం సిపిఐ (ఎమ్ఎల్):- న్యూ డెమోక్రసీ అనుబంధ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య మహబూబాబాద్ జిల్లా ఏడవ మహాసభను జయప్రదం చేయడానికి, అంగడి సెంటర్ పాలడుగు కృష్ణన్న భవన్ ఘనంగా ముస్తాబవుతుంది. ఈ జిల్లా సభను జయప్రదం చేయూటకై జిల్లా నలుమూలల నుండి కళారూపాలు డప్పులతో, అరుణోదయ సాంస్కృతిక సమైక్య కానూరి తాత రచించిన పాటలతో ప్రారంభం అవుతుందని, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మహబూబాద్ జిల్లా నాయకుడు కామ్రేడ్ పుల్లన్న అన్నారు. ప్రజలు విద్యావంతులు, మేధావులు, కమ్యూనిస్టు భావాలు కలిగిన వారు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకుడు కామ్రేడ్ పుల్లన్న కోరారు.

## నేడు పెద్దమల్లారెడ్డిలో మెగా వైద్యశిబిరం

-ఆర్.వి.ఎం. హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలి.

భిక్కనూరు ఏప్రిల్ 07 (తెలంగాణ పత్రిక మండల ప్రతినిధి)



భిక్కనూరు మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో బుధవారం ఆర్.వి.ఎం, హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఉదయం 10;00 గంటల నుండి మధ్యాహ్నం 2;00 గంటల వరకు పెద్దమల్లారెడ్డి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించనున్నారు,ఈ క్యాంప్ నందు (ఈసీజీ)గుండె పరీక్ష ఉచితంగా తీయబడును, అదేవిధంగా వైద్యం గుర్తించిన అనారోగ్య సమస్యలతో బాధపడే రోగులకు పెద్దఎత్తున మందులు ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మెరుగైన వైద్యం నిమిత్తం వైద్యుల సలహా సూచనలు పొందిన వారిని మరసటి రోజు అనగా గురువారం ఉదయం 9;00 గంటలకు ప్రత్యేక బస్సులో ఆర్.వి.ఎం హాస్పిటల్ కి తరలించి వారికి కావలసిన అన్ని వైద్య సేవలు ఉచితంగా అందించబడును గ్రామ పాలకవర్గం సర్పంచ్ తెలిపారు.

## జులై నుండిఒకే ప్రాంగణంలో ట్రామా కేర్, క్రిటికల్ కేర్

-జనరల్ హాస్పిటల్, మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి మెడికల్ కళాశాల

కామారెడ్డి, ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో కామారెడ్డి శాసన సభ్యులు శ్రీ కాటిపల్లి వెంకట రమణ రెడ్డి , కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్ సమక్షంలో నిర్వహించిన హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృశ్య, ఇతర సౌకర్యవంతమైన మౌలిక సదుపాలయాల కల్పన కొరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూమిలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల భవనంలో ఒకే ప్రాంగణంలో ట్రామా కేర్ సెంటర్, క్రిటికల్ కేర్ సెంటర్, జనరల్ హాస్పిటల్, మాతా శిశు సంక్షేమ ఆసుపత్రి , మెడికల్ కళాశాల లను అందుబాటులోనికి తీసుకురావాలని నిర్ణయించడం జరిగింది. గౌరవ కలెక్టర్ ఛైర్మన్ గా హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ. నిర్ణయం మేరకు కమిటీ ఏర్పాటు చేసి జులై నుండి ఆగస్టు లోగా అన్ని విభాగాలు నూతన ప్రాంగణంలో అందుబాటులోకి



తీసుకు రావాలని నిర్ణయించారు.

## గుర్రప్పగూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడ్గులపల్లి/నల్గొండ/ఏప్రిల్ 7:(తెలంగాణ పత్రిక)

రైతులు రభి సీజన్ లో పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరను అందించేందుకు గ్రామాలలో ఐకెపి ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్డిఓ ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి అన్నారు. మాడ్గులపల్లి మండలం గుర్రప్పగూడెం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహశీల్దార్ సరోజ పావని, గ్రామపంచాయతీ సర్పంచ్ పందిరి మారయ్య, ఉపసర్పంచ్ పల్నాటి కరుణాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఎనుగుల జానకిరెడ్డి, ఏపీఎం మధుసూదన్, లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో కూడిన వరి ధాన్యాన్ని తీసుకొని వచ్చి ప్రభుత్వ అందిస్తున్న మద్దతు ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ రమణ, విఓ ప్రెసిడెంట్ పందిరి మంజుల, విఓఏ కొండ్ర లలిత,



తోపాటు గ్రామ రైతులు హమాలీలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట,నిజాంపేట మండలంలో అదనపు కలెక్టర్ నగేష్ అకస్మిక పర్యాటన

-ప్రశాంతంగా పదవతరగతి పరీక్షలు

-నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

-రోగులకు సరైన వైద్యం అందాలి

-భూ భారతి,ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు

-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 07 ఏప్రిల్

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ రామాయంపేట మండలంలో,నిజాంపేట మండలంలో విస్తృతంగా పర్యటించారు. రామాయంపేట ప్రభుత్వ పాఠశాలలో, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరగాలని,




విద్యార్థులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రామాయంపేట ఎంఎల్ఎస్ పాయింట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలన్నారు. స్టాక్ వివరాలను అడిగితెలుసుకున్నారు. నిజాంపేట్ పిహెచ్సి నీ పరిశీలించి రోగులకు మంచి వైద్యం అందాలన్నారు.



రోగులకు ఉచితంగా పరీక్షలు అందించాలని వైద్యులకు సూచనలు అందించారు. నిజాంపేట తహసిల్దార్ కార్యాలయన్నీ తనిఖీ చేశారు భూ భారతి దరఖాస్తులను, ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉండొద్దు అన్నారు.భూ సర్వే ,ఇసుక సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గడ్డివాముకు నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

-ఇంటి తాళం పగలగొట్టి 70 వేల రూపాయల నగదు, బంగారు చైను స్వాహా

-ప్రేమ విషయంలో నిరసన తెలిపిన మరుసటి రోజే ఈ ఘాతకం

పెద్దగూడూరు/కొత్తగూడ/గంగారంఏప్రిల్07.(తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని వాగ్య తండా, ఆమ్లెట్ ఆఫ్ గుండెంగ గ్రామానికి చెందిన తేజావత్ ఉమ్లా, తండ్రి మంజ్య. తేదీ 06.04.2026 న ఉదయం సమయంలో ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లిన సమయంలో, కొంతమంది వ్యక్తులు ఇంటి ముందు వచ్చి ప్రేమ విషయంలో నిరసన వ్యక్తం చేసినారు. అనంతరం ఆ మరుసటి మంగళవారం రోజు తెల్లవారుజామున, సుమారు 04.00 గంటల ప్రాంతంలో, గుర్తుతెలియని వ్యక్తులు, గడ్డివాముకు




నిప్పు పెట్టి, ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువాలో ఉన్న డెబ్బై వేల రూపాయల నగదు, బంగారు చైన్‌ను అపహరించినారు. గడ్డివాము దహనం వల్ల సుమారు పదివేల రూపాయల నష్టం వాటిల్లింది. ఇట్టి సంఘటన పై తేజావత్ ఉమ్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించబడుతోందని,



నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు, గూడూరు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బి. గిరిధర్ రెడ్డి తెలిపారు.

## ఇందిరమ్మ గృహాలను తొందరగా నిర్మించుకోవాలి

కామారెడ్డి , ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలంలోని లింగుపల్లి గ్రామ ములో ప్రత్యేక అధికారిని జ్యోతి,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ లతో కలిసిగ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి తొందరగా పూర్తి చేసుకోవాలని ఏమైనా సామాగ్రి విషయంలో ఇసుక విషయంలో కాని లేబర్ విషయంలో, మేస్త్రీ విషయంలో, ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలపాలని సంబంధిత లబ్ధిదారులకు సూచించడం జరిగింది. గ్రామంలో పెన్షన్ బట్వాడా కేంద్రం సందర్శించి ఎవరీ వద్ద ఎలాంటి డబ్బులు ఆశించకూడదని సంబంధిత బిపిఎం కి ఆదేశించడం జరిగింది. గ్రామంలో ఇంకా నాలుగు ఇందిరమ్మ ఇల్లు మొదలుకాని వాటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి కాంట్రాక్టర్ ద్వారా నిరుపేదలైన లబ్ధిదారుల యొక్క ఇండ్లు నిర్మించుటకు గాను వాటి స్థలాలను పరిశీలించి మార్కెటింగ్ ఇవ్వడం జరిగింది డాక్టర్ బిఆర్అంబేద్కర్ విగ్రహం మరమ్మత్మలను పరిశీలించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్



లక్ష్మి ఉప సర్పంచ్ పాలక సభ్యులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు పెంటయ్య , సాయిలు ఇతరులు హాజరైనారు

## ఏడాదైనా పారితోషికం ఇవ్వరా

-ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఉపాధ్యాయ సంఘాల జేఏసీ

కామారెడ్డి , ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

పదోతరగతి మూల్యాంకనం చేసి ఏడాది పూర్తయిందని, కులగణన చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పారితోషికం ఇంకా ఇవ్వకపోవడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. కామారెడ్డిజిల్లా కేంద్రంలోని పదోతరగతి స్పాట్ కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. 2025లో మార్చిలో నిర్వహించిన పదో తరగతి జనగణన చేసి 18 నెలలు గడుస్తున్నా తమకు రావాల్సిన పారితోషికాన్ని ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా టీటీజేఏసీ (ఐజీుూజ) జిల్లా ఛైర్మన్ అల్లాపూర్ కుశాల్, యూఏస్పీసీ జిల్లా ఛైర్మన్ ఆకుల బాబు, జాక్టో జిల్లా ఛైర్మన్ సయ్యద్ ఖలీముద్దీన్ మాట్లాడుతూ.. 2025 మార్చిలో నిర్వహించిన పదోతరగతి స్పాట్ మూల్యాంకనం విధుల పారితోషికం సుమారు రూ.20 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 50వేల మంది సిబ్బందితో కులగణన నిర్వహించి 18 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం పారితోషికం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కులగనణ సర్వేలో ఎన్యుమరేటర్కు రూ.10వేలు, సూపర్వైజర్కు



రూ.12వేల చొప్పున మొత్తం సుమారు రూ.50 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని చెప్పారు. జనగణన పూర్తి చేసి 18 నెలలు గడుస్తున్నా పార్డోసి కాలనీ ప్రభుత్వం చెల్లించకపోవడం బాధాకరమన్నారు.

# రైతులు ఎండ తీవ్రతలో  తగు జాగ్రత్తలు తీసుకోవాలి

-పశువుల, ఆరోగ్యం కాపాడండి

ఆత్మకూరు ఏప్రిల్ 07, (తెలంగాణ పత్రిక)

ఎండ తీవ్రత వేడి ఎక్కువగా ఉన్న ఈ వేళల్లో రాష్ట్రం మరియు దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు పంటలతో పాటు, వ్యక్తిగత, పశువుల ఆరోగ్యాన్ని రక్షించడం అత్యవసరం గా మారింది. గడిచిన కొన్ని వారాలుగా భారీ హీట్‌వేవ్ పరిస్థితులు ఈ నెల ,మే -జూన్ మధ్య మరింత తీవ్రత చెందే విధంగా ఢిల్లీ మెటియరోలాజికల్ డిపార్ట్మెంట్ హెచ్చరిస్తోంది. పంటల సంరక్షణ కోసం రైతులకు సూచనలు: పంటల వెలుతురు ఎక్కువగా ఉన్న మధ్యాహ్న వేళల్లో పనులు చేయకుండా, ఉదయం వేళలు మరియు సాయంత్రం చల్లగా ఉన్నపుడు చేయండి. మొక్కలకు నీటిని సమయానికి అందించడం ముఖ్యం ప్రత్యేకంగా డ్రిప్ లేదా స్ప్రింక్లర్ పద్ధతులు ఉపయోగించి నీటిని సమానంగా పంపండి, పొలంలోని నేల పరిస్థితిని పరిశీలించండి. వేడిలో పంటల పువ్వులు దిగిపోగానే లేదా గింజలు పూర్తిగా పండే ముందు త్వరగా కోయడం ద్వారా



ధాన్యం నష్టాలను తగ్గించవచ్చు. పరిశోధకులు గోధుమ పంటను "టైమ్లీ హార్వెస్ట్" సూచిస్తున్నారు, ఇది ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా వచ్చే హాని నుండి రక్షిస్తుంది. పొలాల్లో మాల్చింగ్ ద్వారా నేలకు నీటి ఆవిర్భవాన్ని ఆపు; ఇది నేల ఉష్ణోగ్రతను కూడా తగ్గిస్తుంది. పశువుల విషయాలు: ఎండివేళల్లో పశువులు కూడా వేడితో అతి ప్రభావం పడుతుంటాయి. వారికి నీడా ఉన్న, వెంటిలేటెడ్ ఉన్న ప్రదేశంలో ఉండేలా చూసుకోవాలి మరియు నిర్దిష్ట సమయాల్లో మాత్రమే పశువులను మేతకు పంపండి. తరచుగా చల్లని నీరు అందించడం వల్ల హీట్ స్ట్రెస్ ను తగ్గిస్తుంది. రైతుల ఆరోగ్యం కోసం. వేడి వేళల్లో



పొలంలో ఎక్కువకాలం ఉండకండి, మధ్యాహ్నం 11 నుండి 3 గంటల మధ్య గరిష్ట వేడితో ఉంటుంది. అందువలన ఆ సమయాల్లో పనులను తగ్గించి, తరచుగా నీరు త్రాగి శరీర హైడ్రేషన్ కాపాడం. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం ఖాతరియు, పశు పాలన వంటి రంగాల్లో ఉష్ణోగ్రత పెరుగుదలను గమనించి ఈ సూచనలు పాటించడం ద్వారా రైతులు తమ పంటలు, పశువులు మరియు తమ ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి






-నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ సేకరించాలి
-కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07, తెలంగాణ పత్రిక

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుపై ఏపీఎంలు, ఐకేపీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, బుక్ కీపర్లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం శిక్షణ ఇవ్వగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. గ్రేడ్ ఏ రకం వరి ధాన్యం క్వింటాలుకు రూ.2,389, కామన్ రకానికి క్వింటాలుకు రూ.2,369 గా ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ఈ సీజన్లో దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని వివరించారు. ఐకేపీ ఆద్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న 136 కొనుగోలు కేంద్రాల్లో టెంట్లు వేయించాలని, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. తూకం వేసే యంత్రాలు, తేమ శాతం చూపే యంత్రాలు, టార్పాలిన్లు, గన్ని బ్యాగ్స్ సరిపడా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు ఇతర వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సంబంధిత ఏఈఓ ధృవీకరించిన తరువాత కొనుగోలు చేయాలని, కేటాయించిన మిల్లులకు మాత్రమే ధాన్యాన్ని పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల వద్ద రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు, అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, పౌర సరఫరాల శాఖ డీఎం నర్సింహారెడ్డి, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# జనం సొమ్ముతో డిన్నర్లు పెట్టుకుంటున్న కడప కార్పొరేషన్ అధికారులపై విచారణ జరిపించాలి

-పన్ను వసూలులో లక్షల బకాయిలు ఉన్న సంపన్నులను వదిలేసి సామాన్యులను పీడిస్తున్న మున్సిపల్ / కార్పొరేషన్ అధికారుల వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం సి పి ఐ డిమాండ్

కడప ఏప్రిల్ 07 తెలంగాణ పత్రిక

జనం నుండి వసూలు చేసిన జనరల్ ఫండ్ ను అధికారులు అధికార పార్టీ నేతల ఆదాయ వనరుగా మారిస్తే అడ్డుకుంటాం కడప కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళనలో అఖిలపక్ష పార్టీ ప్రజాసంఘాల డిమాండ్ పన్ను వసూలులో లక్షల బకాయిలు ఉన్న సంపన్నులను వదిలేసి సామాన్యులను పీడిస్తున్న మున్సిపల్ / కార్పొరేషన్ అధికారుల వైఖరిని నిరసిస్తూ అఖిలపక్ష పార్టీ ప్రజాసంఘాలు తలపెట్టిన జిల్లా వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం స్థానిక కడప కార్పొరేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ పాకా సురేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ అలీ ఖాన్, జేవి రమణ, సంగటి మనోహర్, దస్తగిరి, ఎస్కే మైనుద్దీన్, అమీన్ పీర్, మాజీ కార్పొరేటర్ లు సమ్మెట బసవరాజు, షఫీ, అజమతుల్లా , రామకృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, రామచంద్రయ్య తదితరులు మాట్లాడుతూ స్థానిక సంస్థలు స్వయం పరిపాలన దిశగా నిధులు, విధులు చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యాంగం ఇచ్చిన హక్కును అధికారులు అధికార పార్టీ నేతలు ఉల్లంఘిస్తున్నారని వారు ఆరోపించారు. జిల్లాలో ఇంటి పన్ను నీటి పన్ను ఖాళీ స్థలాల పన్ను వసూలులో లక్షల బకాయిలు ఉన్న సంపన్న వర్గాల జోలికి పోకుండా సామాన్యులను పీడించి కుళాయి కనెక్షన్ కట్ చేస్తామంటూ, ఇంటికి తాళాలు వేస్తామంటూ ఫైనాన్స్ కంపెనీల కంటే అధ్వానంగా వ్యాపార సంస్థలను తలదన్నే విధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించారన్నారు. ఇంత ఒత్తిడి చేసి వసువులైన జనరల్ ఫండ్ ను తిరిగి జనం కోసం మౌలిక సదుపాయాలైన రోడ్లు కాలువలు వీధిలైట్లు త్రాగునీటి వసతి కల్పనకు ఖర్చు చేయడంలో శ్రద్ధ పెట్టడం లేదన్నారు. మురికివాడల్లో మౌలిక సమస్యలతో వేసవి ఆరంభంలోనే గుక్కెడు మంచినీటి కోసం కటకటా అనాల్సి వస్తుందన్నారు. చిన్నపాటి వర్షాలకే బయటికి పోయే మార్గాలు లేక మురికి కూపాలుగా మారి, దోమలకు నిలయాలై చికెన్ గున్యా డెంగ్యూ మలేరియా లాంటి




విష జ్వరాల బారినబడి ఆసుపత్రుల చుట్టూ తిరిగి అప్పులపలై ఉన్న ఇంటిని కూడా అమ్ముకునే దుస్థితి నెలకొన్నది అన్నారు. గత పాలకవర్గంలో 15 ఫైనాన్స్ నిధులను ఖర్చు చేసేందుకు తీర్మానం చేసి, టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాల్సిన సమయంలో అధికార పార్టీ నేతల జోక్యంతో టెండర్లను రద్దు చేసిన చరిత్ర కడప కార్పొరేషన్ కి దక్కుతుందన్నారు. జనం నుండి వసూలు చేసిన జనరల్ ఫండ్ ను జనావాసాల్లో కాకుండా సంపన్న వర్గాల ఆర్థిక ప్రయోజనాల కోసం వెంచర్లలో ఖర్చు చేస్తున్నారని వారు ఆరోపించారు. లక్షల నుండి కోట్లలో బకాయిలు ఉన్న సంపన్నుల జోలికి ఎందుకు పోవడం లేదని నగరపాలక సంస్థ అధికారులు నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రెవిన్యూ, పోలీస్, ఆర్ అండ్ బి, రైల్వే, ఆర్టీసీ, ఎలక్ట్రిసిటీ లాంటి సంస్థలు లక్షల బకాయిలు పేరుకుపోయినప్పటికీ వసూలులో ఎందుకు జాబ్ ఏం చేస్తున్నారని వారు నిలదీశారు. ప్రభుత్వం నుండి బిపిఎస్, మ్యుటేషన్, అమృత్, స్టాంప్ డ్యూటీ ఫీజు బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మున్సిపల్ /కార్పొరేషన్ పాలకవర్గం గడువు ముగియడంతో పోటీపడి పన్ను వసూలు చేసి వచ్చిన జనరల్ ఫండ్ ను అధికారులు అధికార పార్టీ నేతలు ఇస్తారాజ్యంగా ఖర్చు చేయడానికి పక్కా ప్రణాళిక రూపొందించుకున్నారని వారు విమర్శించారు. వివిధ విభాగాలలో అధికార పార్టీ నేతలను అనధికారిక ప్రజా ప్రతినిధులుగా గౌరవిస్తూ ఏ విభాగంలో ప్రజలకు పని కావాలంటే అధికారులకు అధికార పార్టీ నేతలకు మామూలు ముట్ట చెప్పాలని డిమాండ్ చేస్తున్నారని వారు ఆరోపించారు. పన్ను వసూలులో వచ్చిన నిధులను కడప కార్పొరేషన్ అధికారులు వారి డిన్నర్లకు, విలాసాలకు, ఛాంబర్ లో రెన్యూవేషన్ పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ప్రజాధనాన్ని ఇష్టారాజ్యంగా ఖర్చు చేసే అధికారం వీరికి ఎవరిచ్చారని వారు నిలదీశారు. అనంతరం కడప కార్పొరేషన్ కమిషనర్ రాకేష్ చంద్ర ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి వేణుగోపాల్, కేసిబాదుల్లా, సుబ్రమణ్యం, మనోహర్ రెడ్డి, మునయ్య, లింగన్న, రామ్మోహన్ రెడ్డి, బ్రహ్మం, నారాయణ, ఎల్ చంద్ర, లక్ష్మీనారాయణ, సిపిఎం నాయకులు దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటేపల్లి




కామారెడ్డి , ఏప్రిల్ 7,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి నియోజకవర్గం లోనిఅంగన్వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున వర్కర్ల డిజిటలైజేషన్ లో భాగంగా స్మార్ట్ పోన్ లు ,విద్యార్థులకు యూనిఫాం లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని కామారెడ్డి శాసనసభ్యులు కాటేపల్లి వెంకటరమణారెడ్డి మంగళవారం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పలు అంగన్వాడి టీచర్లకు విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు స్కూల్ డ్రెస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విద్యార్థులు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# మైనర్ యువకుడి అదృశ్యం

తెలంగాణ పత్రిక జహీరాబాద్(ప్రతినిధి)ఏప్రిల్ 07,



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల పరిధిలోని ఇప్పపల్లి గ్రామానికి చెందిన గొల్ల పవన్ కుమార్ (17) అనే యువకుడు మంగళవారం ఉదయం నుండి కనిపించకుండా పోయినట్లు అతని తండ్రి గొల్ల మహిపాల్ చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహిపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. అతని కుమారుడు పవన్ కుమార్ చింతకుంటలోని ఎం.జె.పి (వీబీూ) జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షలు ముగియడంతో మార్చి 12వ తేదీన ఇంటికి వచ్చాడు. ఉదయం 10:00 గంటల సమయంలో తల్లిదండ్రులు పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి పవన్ ఇంట్లో లేడు. బంధువుల ఇళ్లలో మరియు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతు చిరాగపల్లి పోలీస్ స్టేషన్ లో పిర్యాదు ఇవ్వడం జరిగింది. ఇచ్చిన పిర్యాదు ప్రకారం చిరాగ్ పల్లి పోలీస్ వారు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నం అని చిరాగ్ పల్లి ఎస్.ఐ రాజేందర్ రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు చిరాగ్ పల్లి పోలీస్ స్టేషన్ 100 కి కాల్ చేసి చెప్పాలని తెలియజేసారు.

# దేవాలయ ఆస్తిపై వివాదం తహసీల్దార్ సర్టిఫికేట్ రద్దుకు సర్పంచ్ విజ్ఞప్తి




సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామంలో దేవాలయ ఆస్తి విషయంలో వివాదం తలెత్తింది. గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పిస్తూ, తహసీల్దార్ జారీ చేసిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరారు. సర్పంచ్ తెలిపిన వివరాల ప్రకారం, పాత నీలోజిపల్లి గ్రామం మిడ్ మానేర్ ప్రాజెక్ట్ కింద మునిగిపోవడంతో, గ్రామస్తులను నర్సింగాపూర్ రెవెన్యూ పరిధిలోని పునరావాస (ఆర్ ఔ ఆర్) కాలనీలో స్థిరపరిచారు. అక్కడ గ్రామస్తులు కలిసి పాత గ్రామ దేవాలయ నిధులు మరియు గ్రామపంచాయతీ నిధులతో శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఈ దేవాలయం ఈ-పంచాయత్ రికార్డుల్లో అసెస్మెంట్ నంబర్ 312 (2019) కింద గ్రామపంచాయతీ ఆస్తిగా నమోదైందని తెలిపారు.అయితే, మాజీ సర్పంచ్ కుసా రవీందర్ తప్పుడు సమాచారం ఇచ్చి దేవాలయాన్ని వ్యక్తిగత నిర్మాణంగా చూపించినట్లు ఆరోపించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ సరైన స్థల పరిశీలన చేయకుండా నివేదిక సమర్పించగా, దాని ఆధారంగా తహసీల్దార్ 31-03-2026 తేదీతో సర్టిఫికేట్ నంబర్ బి/234/2026 జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో సహజ న్యాయసూత్రాల ఉల్లంఘన, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధంగా వ్యవహరించడం, అధికార దుర్వినియోగం జరిగినట్లు సర్పంచ్ ఆరోపించారు. ఈ సర్టిఫికేట్ వల్ల గ్రామ ఆస్తిపై తప్పుడు వ్యక్తిగత హక్కులు ఏర్పడుతున్నాయని, గ్రామంలో శాంతి భంగం కలుగుతోందని.

## అకస్మాత్తుగా తనిఖీలు ఎంజీఎంలో ఎమ్మెల్యే నాయిని



తెలంగాణ పత్రిక వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరో 7 ఏప్రిల్

MGM దవాఖానలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. జనరల్ ఓపి విభాగంలో రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. విధులల్లో ఉన్న వైద్యులతో నేరుగా మాట్లాడుతూ రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుపేరేండెంట్ ఛాంబర్ లో ఇటీవలే దవాఖానలో జరుగుతున్న పరిణామలపై సుదీర్ఘంగా చర్చించారు. మెడిసిన్ విభంగాలో ఉన్న అలసత్వం కావాల్సిన నిధులపై సత్వరమే ప్రణాళిక ఇవ్వాలని కోరారు. పేద ప్రజలకు వైద్యారోగ్యంలో కల్పవృక్షం లాంటి ఈ దవాఖానను ప్రతి ఒక్కరి అంకిత భావంతో పనిచేయాలని కోరారు.

## హైదరాబాద్ లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆఫీస్ పై వైసీపీ దాడిని ఖండిస్తున్నాము

-వద్దెశీ విజయ్ టిడిపి నగర కమిటీ ఖమ్మం

ఖమ్మం బ్యూరో ఏప్రిల్ 7 తెలంగాణ పత్రిక



ఖమ్మం నగరం: అమరావతిపై జగన్ వైఖరిని ప్రశ్నించినందుకు ఏబీఎన్ ఆఫీసుపై దాడి చేయటం హేయమైన చర్య అని తెలుగుదేశం పార్టీ ఖమ్మం హడాహాక్ కమిటీ సభ్యులు వద్దెశీ విజయ్ ఒక ప్రకటన లో తీవ్రంగా ఖండించారు నిజాలను నిర్భయంగా రాసే న్యూస్ పేపర్ల పై జర్నలిస్ట్ లపై వైసీపీ రౌడీమూకలు దాడి చేయటం సబబు కాదని గతంలో ఈనాడు సంస్థలపై కూడ దాడి చేసారని ఇలాంటి చర్యలు వైసీపీ అల్లరి మూకలు మాను కోవాలని లేదంటే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు దాడి చేసిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేసారు. ఇలాంటి సంఘటనలు మరల పునరావతం కావద్దని తెలుగుదేశం పార్టీ ఎప్పుడు నిజాలు నిబ్బరంగా తెలియజేసే జర్నలిస్టులకు అండగా ఉంటుందని వడెం విజయ్ తెలియజేశారు

## గిడ్డంగుల సంస్థ గోడౌన్ లో నిల్వ చేస్తున్న బియ్యం నిల్వలను పరిశీలించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు




తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

నిర్మల్ జిల్లా జిల్లా,బోరిగాం లోని గిడ్డంగుల సంస్థ గోడౌన్ లో ఎఫ్.సి.ఐ నిల్వ చేస్తున్న బియ్యాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పరిశీలించారు.. బియ్యం నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు గోడౌన్ ల నిర్వహణ, వసతులతో పాటు ఎగుమతులు,దిగుమతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.బియ్యం నిల్వల్లో జాగ్రత్తలు పాటించాలని ఉద్యోగులకు సూచించారు..విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## కిండర్ గార్డెన్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుక

ఖమ్మం ఏప్రిల్ 7 తెలంగాణ పత్రిక



ఖమ్మం నగరం: త్రీ టౌన్ లో గల మాంట్ఫోర్ట్ హైస్కూల్ లో కిండర్ గార్డెన్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రాంగణంలో ఆనందో త్సాహాల మధ్య జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ జాన్ పాల్ హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల విద్యా ప్రయాణంలో కిండర్ గార్డెన్ దశ ఎంతో ముఖ్యమని భవిష్యత్తులో వారు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు ఈ వేడుక పిల్లల జీవితంలో ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలిచిందని విద్యార్థులు గ్రాడ్యుయేషన్ క్యాప్స్ ధరించి తమ ప్రతిభను ప్రదర్శించగా తల్లిదండ్రులు ఆనందభాష్పాలతో ఈ వేడుకను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ జోష్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

## అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ గజిటెడ్ హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 79 జారీ

-తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ వెల్లడి.

తెలంగాణ పత్రిక హుజురాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 7.



తెలంగాణ రాష్ట్రంలో వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న 537 ఏ సి టి ఓ లకు గజిటెడ్ హోదా మంజూరి చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ మరియు ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు జీవో ఎంఎస్ 79 జారీ చేసినారు అని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపకుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఈరోజు పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ఈ సమావేశంలో మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ దాదాపు పది సంవత్సరాల నుండి అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్స్ గజిటెడ్ హోదా కొరకు రెండు పి ఆర్ సి లు కమిషన్ రికమండేషన్ చేయగా లా సెక్రటరీ జే ఏ డి తెలంగాణ వాణిజ్య పనుల శాఖ కమిషనర్ మరియు వాణిజ్య పనుల శాఖ మరియు ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ఉపముఖ్యమంత్రి చీఫ్ మినిస్టర్ ఇంతమంది రికమండేషన్ చేయక ఈరోజు తెలంగాణ రెవెన్యూ మరియు వాణిజ్య పన్నుల శాఖ ఎక్సైజ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు జీవో ఎంఎస్ 79 ను మంజూరు చేశారు. తెలంగాణ రాష్ట్ర అంతట వాణిజ్య పనుల శాఖలో పనిచేస్తున్న 537 మంది డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్స్ ఏ సి టి ఓ అందరూ గెజిటెడ్ హోదా పొందిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంతట వాణిజ్య పన్నుల శాఖ టపాకాలు పేల్చి ఒకరికి ఒకరు అలైబాలై చేసుకుంటూ స్వీట్లు తినిపించి శు భాకాంక్షలు తెలియజేశారు. తేదీ 23 22017 రోజు అప్పటి రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ అజయ్ మిశ్రా మరియు అప్పటి కమిషనర్ ఏ అనిల్ కుమార్ తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం వ్యవస్థ స్థాపకుడు రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో రేప్రజెంటేషన్ ఇవ్వటం జరిగింది అప్పటినుండి ఇప్పటివరకు ఎన్నో రకాల ఉద్యమాలు చేయటం వలన ఈరోజు తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న 537 మంది ఏ సిటిఓ లకు ఈరోజు గజిటెడ్ హోదా రావడానికి కాంగ్రెస్ పార్టీ మంత్రులు పొన్నం ప్రభాకర్ సీతక్క కొండ సురేఖ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 36 మంది ఎమ్మెల్యేలు ఇద్దరు ఎమ్మెల్సీ బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు ఐదుగురు ఆల్ ఇండియా మజిలీస్ పార్టీ ఆరుగురు శాసనసభ్యులు ఒక ఎంపీ ఇద్దరు ఎమ్మెల్సీలు టిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులు ఆరుగురు సిపిఐ శాసనసభ పక్ష నాయకుడు ఇంతమంది సహకరించినందుకు ఈరోజు ఏ సి టి ఓ గజిటెడ్ హోదా దక్కడానికి సహకరించిన అందరితోపాటు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా వాణిజ్య పన్నుల శాఖ మరియు ఎక్సైజ్ శాఖ రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం రఘునందన్ రావు లకు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## డంపింగ్ యార్డ్ ను తరలించాలని ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు వినతి

-బిప్రణవ్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిసిన డంప్ యార్డ్ జేఏసీ నాయకులు,మున్సిపల్ పాలకవర్గం.

-డంప్ యార్డ్ తరలింపునకు కృషి చేయాలని కోరిన నాయకులు.

-ఇప్పటికే ప్రణవ్ ద్వారా తన దృష్టికి వచ్చిందని వెల్లడి.

-సానుకూలంగా స్పందించిన జిల్లా ఇంచార్జి మంత్రి.

తెలంగాణ పత్రిక హైదరాబాద్:హుజురాబాద్/ఏప్రిల్ 07



వెస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా హుజురాబాద్ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందని,ప్రజల ఆరోగ్యమే కాకుండా సారవంతమైన నేల కలిగిన హుజూరాబాద్,సిర్సపల్లి ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటదని హుజూరాబాద్ డంప్ యార్డ్ జేఏసీ నాయకులు, హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గం అన్నారు. మంగళవారం రోజున సెక్రటేరియట్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాంబర్ లో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, పాలకవర్గం, మున్సిపల్ పరిధిలోని నాయకులతో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గం ఈ డంప్ యార్డును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారని ఆ విషయాన్ని మంత్రికి వివరించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ వేరే చోటుకు తరలించాలని,ఈ ప్రాంత భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని సానుకూల ప్రకటన చేయాలని జేఏసి నాయకులు కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి ఇప్పటికే ఈ విషయంపై ప్రణవ్ నా దృష్టికి తీసుకువచ్చాడని తప్పకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, సిర్సపల్లి సర్పంచ్ పోల్సాని రామారావు, కౌన్సిలర్లు,జేఏసీ నాయకులు, మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకట్రాజం, వేల్పుల రత్నం, ప్రభాకర్, తులసి లక్ష్మణమూర్తి, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, డంపు యార్డు బాధిత గ్రామాల కాంగ్రెస్ నాయకులు సుగుణాకర్ రెడ్డి, చందమల్ల బాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగే అంబేద్కర్ 135వ జయంతి భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

-హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ అంబాల ప్రభాకర్(ప్రభు).

తెలంగాణ పత్రిక జమ్మికుంట/ఏప్రిల్ 7.





బిఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బెహెన్జీ కుమారి మాయావతి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించింది. అందులో భాగంగా అదిలాబాద్ జోన్ (వన్) పరిధిలో అదిలాబాద్ నిజామాబాద్ కరీంనగర్ జహీరాబాద్ పార్లమెంటరీ స్థాయిలో భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ లోని మహాత్మ జ్యోతి రావు పూలే (సర్కస్ గ్రౌండ్) మైదానంలో ఈనెల 14న సాయంత్రం బి.ఎస్.పి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని తెలిపారు .మంగళ వారం జమ్మికుంట పట్టణంలో గాంధీ చౌరస్తా వద్ద అంబేద్కర్ జయంతి వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీసీ,ఎస్సీ, ఎస్టీ మైనారిటీ అగ్రవర్ణ పేదలందరూ, బహుజన సమాజ్ పార్టీ నాయకులు అంబేద్కర్ అభిమానులు అంబేద్కర్ సంఘ నాయకులు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్లమెంట్ ఇన్చార్జ్ దొడ్డే శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు మహేందర్, బీఎస్పీ ఎమ్మెల్యే ఎంపీ కాంటెస్ట్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వేల్పుల మల్లేష్, జమ్మికుంట మండల అధ్యక్షులు దాసరపు మహేందర్, బీసీ సంఘాల సమన్వయ కమిటి హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మామిండ్ల మల్లయ్య యాదవ్, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్చార్జ్ మంద జగన్, గంగారపు ప్రశాంత్, అంబాల అంజి, గంగారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డు నిర్మాణాన్ని తక్షణమే రద్దు చేయకపోతే తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమ ఉధృతి చేస్తాం

-రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు.

తెలంగాణ పత్రిక హుజురాబాద్:టౌన్/ఏప్రిల్ 7



డంపింగ్ యార్డు నిర్మాణాన్ని తక్షణమే రద్దు చేయకపోతే తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమ ఉధృతి రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు హుజురాబాద్ ప్రాంతానికి రెండు కిలోమీటర్ల దూరంలోని సిర్సపల్లి గ్రామ సరిహద్దులో పచ్చని పొలాల హైవే ప్రక్కన నిర్మించ తల పెట్టిన వేస్టు టు ఎనర్జీ డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును రద్దు చేస్తూ అధికారిక ప్రకటన చేయాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక శాసన సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి వేలాది మంది తో మంగళవారం చేపట్టిన 24 గంటల నిరాహార దీక్ష శిబిరాన్ని రైతు ప్రజాసంఘాల జేఏసీ నాయకులు తో కలిసి పోలాడి రామారావు సందర్శించి పాడి కౌశిక్ రెడ్డికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ వరంగల్ జిల్లాల చెత్తను తరలించడానికి మధ్యలో ఉన్న హుజూరాబాద్ ప్రాంతంలో ఎలాంటి నిబంధనలు పాటించకుండా రాంకీ అనే ప్రైవేట్ సంస్థకు డిజైన్ బిల్డ్ ఫైనాన్స్ ఆపరేట్ ట్రాన్స్ఫర్ డిబిఎఫ్ఓటి పద్ధతిలో డంప్ యార్డ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని అప్పజెప్పి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా . 25 ఏళ్ల క్రితం జవహర్ నగర్లో నిర్మించిన రాంకీ సంస్థకు అప్పజెప్పడం అధికార ప్రజా ప్రతినిధుల ప్రమేయం తోనే జరిగిందని ధ్వజమెత్తారు. ఇప్పటికే జవహర్ నగర్లో ఈ రాంకీ సంస్థ నిర్మించిన డంప్ యార్డ్ వాళ్ళ అక్కడి వేలాది మందికి అనారోగ్య కారణాల వల్ల మంచం పట్టి రోగాల వినికిడి సమస్యలతో తో అవస్థల పాలై జీవచ్ఛవాళ్ళ పడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చెందారు. ఇట్టి డంప్ యార్డ్ ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని ప్రజలు రోడ్ల పైకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వంలో కనీస చలనం లేదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దీక్షతో నేడు వేలాది మంది ప్రజల నినాదాలతో తెలంగాణ ఉద్యమ తరహాలో నిరసనలతో హోరెత్తించారని వేలాది మంది మహిళలు పాల్గొన్నారని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డంపింగ్ యార్డు నిర్మాణాన్ని తక్షణమే నిలిపి వేస్తూ అధికారికంగా ప్రకటించాలని పోలాడి రామారావు డిమాండ్ చేశారు కాలయాపన చేస్తే మూల్యం చెల్లించక తప్పదని ప్రభుత్వాన్ని స్తంభింప జేస్తామని హెచ్చరించారు ప్రైవేట్ సంస్థ తో కాకుండా ప్రభుత్వమే జపాన్ లో నిర్మించినట్లుగా ఎలాంటి కాలుష్యం లేకుండా ఉండే విధంగా జనావాసాలకు దూరంగా నిర్మించాలని రామారావు డిమాండ్ చేశారు. కమిషన్ ల కోసం ప్రజల ప్రాణాలను ఫణంగా పెట్టవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎడవెల్లి కొండాల రెడ్డి మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును అడ్డుకొని తీరుతామని ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తెలంగాణ ఉద్యమ తరహాలో ఉద్యమించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# బిజినెస్

## ఆర్బీఐ నిర్ణయానికి ముందు మార్కెట్ల దూకుడు... చివరి గంటలో కొనుగోళ్ల జోరు

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు లాభాల బాటలో పయనించాయి. ట్రేడింగ్ చివరి గంటలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో బీఎస్ఈ సెన్సెక్స్ 507.73 పాయింట్లు పెరిగి 74,616.58 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 155.40 పాయింట్లు లాభపడి 23,123.65 వద్ద ముగిసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో, ఇవాళ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఆరంభంలో ఆచితూచి సాగినప్పటికీ, చివరి సెషన్‌లో ఐటీ, మెటల్ రంగ షేర్లలో కొనుగోళ్ల జోరు పెరిగింది. దీంతో మార్కెట్లు లాభాలను నిలబెట్టుకున్నాయి. నిఫ్టీలో విప్రో, హిందాల్కో ఇండస్ట్రీస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్ అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. ఈసారి కూడా ఆర్బీఐ రెపో రేటును యథాతథంగా ఉంచుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ, భవిష్యత్ విధానాలపై ఆర్బీఐ గవర్నర్ చేసే వ్యాఖ్యల కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇక రంగాల వారీగా చూస్తే ఐటీ, రియల్టీ, మెటల్ సూచీలు రాణించాయి. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా నష్టపోయింది.



బ్రాడర్ మార్కెట్‌లో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.20 శాతం స్వల్పంగా లాభపడగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.06% మేర నష్టపోయింది. నిఫ్టీకి 23,000 వద్ద తక్షణ మద్దతు ఉందని, 23,500–23,600 స్థాయి వద్ద నిరోధం ఎదురుకావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## రూ.1కే బీఎస్ఎన్ఎల్ అన్‌లిమిటెడ్ ప్లాన్... కానీ!




తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు ఓ సంచలన ఆఫర్‌ను మళ్లీ తెరపైకి తెచ్చింది. తన ప్రముఖ 'ఫ్రీడమ్ ప్లాన్' కింద కేవలం ఒక్క రూపాయి చెల్లింపుతో 30 రోజుల పాటు అపరిమిత సేవలను అందిస్తోంది. ఈ ఆఫర్ ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్ కింద వినియోగదారులకు 30 రోజుల వాలిడిటీతో పాటు పలు ప్రయోజనాలు లభిస్తాయి. ఏ నెట్‌వర్క్‌కైనా అపరిమిత వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. రోజుకు 2GB చొప్పున మొత్తం 60GB హై-స్పీడ్ 4G డేటా, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా అందిస్తారు. సిమ్ కార్డును కూడా ఉచితంగానే అందజేయనున్నారు. ఈ ఆఫర్ వివరాలను బీఎస్ఎన్ఎల్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ప్రకటించింది. అయితే, ఈ ఆఫర్ కేవలం కొత్తగా బీఎస్ఎన్ఎల్ కనెక్షన్ తీసుకునే వారికి లేదా ఇతర నెట్‌వర్క్‌ల నుంచి మొబైల్ నంబర్ పోర్టబిలిటీ ద్వారా మారే వారికి మాత్రమే వర్తిస్తుందని సంస్థ స్పష్టం చేసింది. ప్రస్తుత వినియోగదారులకు ఇది అందుబాటులో లేదు. ఇతర టెలికాం సంస్థలు రీఛార్జ్ ధరలను పెంచుతున్న తరుణంలో, తన 4G నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకుంటూ మార్కెట్‌లో వాటాను పెంచుకోవాలని బీఎస్ఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ 'ఫ్రీడమ్ ప్లాన్' పొందాలనుకునే ఆసక్తిగల వారు తమ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్ లేదా అధీకృత రిటైలర్లను సంప్రదించవచ్చు. కొత్త సిమ్ తీసుకోవాలనుకునే వారికి ఇది ఒక మంచి అవకాశమని, గడువులోగా ఈ ఆఫర్‌ను వినియోగించుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## ఎయిర్ ఇండియాకు షాక్.. సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

ఎయిర్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) క్యాంప్‌బెల్ విల్సన్ తన పదవికి రాజీనామా చేశారు. సంస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న కీలక తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు ప్రముఖ న్యూస్ అవుట్‌లెట్ 'మింట్'ను ఉటంకిస్తూ 'రాయిటర్స్' వార్తా సంస్థ కథనాన్ని ప్రచురించింది. అయితే, కొత్త సీఈవో నియామకం జరిగేంత వరకు విల్సన్ తన బాధ్యతల్లో కొనసాగుతారు. గత వారం జరిగిన బోర్డు సమావేశంలో విల్సన్ రాజీనామాను ఆమోదించినట్లు సమాచారం. కొత్త సీఈవో నియామకం పూర్తయ్యే వరకు, అవసరమైతే సెప్టెంబర్ వరకు కూడా ఆయన పదవిలో ఉండే అవకాశం ఉంది. టాటా గ్రూప్ యాజమాన్యంలోకి ఎయిర్ ఇండియా వచ్చిన తర్వాత 2022 సెప్టెంబర్‌లో విల్సన్ బాధ్యతలు స్వీకరించారు. తన కాంట్రాక్ట్ గడువుకు మించి కొనసాగేందుకు ఆయన ఆసక్తి చూపకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త సీఈవో కోసం అన్వేషణ ఇప్పటికే చివరి దశలో ఉన్నట్లు నివేదిక పేర్కొంది. ఎయిర్ ఇండియా ప్రస్తుతం తీవ్రమైన నిర్వహణ ఒత్తిళ్లు, పెరుగుతున్న ఖర్చులతో సతమతమవుతోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా విమానాలను దారి మళ్లించాల్సి వస్తుండటంతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగింది. మరోవైపు, కొత్త విమానాల డెలివరీలో జాప్యం జరగడం విస్తరణ



ప్రణాళికలకు ఆటంకంగా మారింది. ఇదేకాకుండా, గతేడాది అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ప్రభావం కూడా సంస్థపై ఇంకా కొనసాగుతోంది. AI 171 బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం కుప్పకూలిన ఘటనలో ప్రయాణికులు సహా 241 మంది మరణించారు. ఈ దుర్ఘటన సంస్థ ప్రతిష్ఠ, నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపింది. కాగా, విల్సన్ రాజీనామా పై ఎయిర్ ఇండియా ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## ధురంధర్ 2 పై కోహ్లీ రివ్యూ.. ఇప్పటివరకు ఇలాంటి సినిమా చూడలేదంటూ ప్రశంసలు!

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇటీవలే విడుదలైన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ధురంధర్ 2'పై ప్రశంసల వర్షం కురిపించాడు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, భారతదేశంలో ఇంతటి అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని తానెప్పుడూ చూడలేదని పేర్కొన్నాడు. "ఈ రోజు సినిమా చూశాను. ఇండియాలో ఇలాంటి సినిమాటిక్ అనుభవాన్ని నేనెప్పుడూ చూడలేదని ధైర్యంగా చెప్పగలను. దాదాపు 4 గంటల పాటు ఒక్క క్షణం కూడా కనురెప్ప వాల్చకుండా చూశాను. దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభ, నమ్మకం ఈ సినిమాలో కనిపిస్తున్నాయి. మీకు నా హ్యాట్సాఫ్. మీరు ఒక జీనియస్. నటీనటులందరూ అద్భుతంగా చేసినా, రణ్‌వీర్ సింగ్ ఈ సినిమాతో మరో స్థాయికి చేరుకున్నాడు. ఆయన నటన అద్భుతం" అని కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. కోహ్లీ భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా ఈ చిత్రంపై ప్రశంసలు కురిపించింది. దాదాపు 4 గంటల నిడివి ఉన్నప్పటికీ, సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందని పేర్కొంటూ, దర్శకుడు ఆదిత్య ధర్ ప్రతిభను, రణ్‌వీర్ సింగ్ నటనను ఆమె కొనియాడింది. వసూళ్ల విషయానికొస్తే, 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. జియో స్టూడియోస్ విడుదల చేసిన





లెక్కల ప్రకారం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1622 కోట్ల గ్రాస్ వసూలు చేసింది. దేశీయంగా రూ. 1041 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించింది. యాక్షన్, జాతీయవాదం వంటి అంశాలతో రూపొందిన ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## ఆసీస్ మహిళా క్రికెటర్ ను పెళ్లాడిన ఇంగ్లండ్ మహిళా క్రికెటర్

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

ఇంగ్లండ్ మహిళా క్రికెట్ జట్టు స్టార్ వికెట్ కీపర్–బ్యాటర్ అమీ జోన్స్ ఓ ఇంటివారయ్యారు. తన చిరకాల ప్రేయసి, ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెటర్ పీపా క్లియరీని ఆమె వివాహం చేసుకున్నారు. ఏప్రిల్ 4న పశ్చిమ ఆస్ట్రేలియాలో వీరి వివాహం జరిగింది. ఈ విషయాన్ని అమీ జోన్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. "04.04.26 ది బెస్ట్ డే" అనే క్యాప్షన్‌తో పెళ్లి ఫొటోలను పంచుకున్నారు. మహిళల బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)లో పెర్త్ స్కార్చర్స్ జట్టుకు ఆడుతున్న సమయంలో అమీ జోన్స్, పీపా క్లియరీ మధ్య పరిచయం ఏర్పడింది. ఈ స్నేహం ప్రేమగా మారడంతో 2022 నుంచి డేటింగ్‌లో ఉన్నారు. గత ఏడాది జులైలో వీరి నిశ్చితార్థం జరిగింది. తాజాగా ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ప్రస్తుతం వీరిద్దరూ ఇంగ్లండ్‌లోని లఫ్‌బరోలో కలిసి నివసిస్తున్నారు. వీరి వివాహ వేడుకకు ఇంగ్లండ్ క్రికెటర్లు నాట్ సివర్–బ్రంట్, కేథరిన్ బ్రంట్ బ్రైడ్స్‌మెయిడ్స్‌గా హాజరవడం విశేషం. ఇటీవలి కాలంలో మహిళా క్రికెట్‌లో స్వలింగ వివాహాలు సాధారణమయ్యాయి. ఇప్పటికే



నాట్ సివర్–కేథరిన్ బ్రంట్ (ఇంగ్లండ్), డేన్ వాన్ నికెర్క్–మరిజాన్ కాప్ (దక్షిణాఫ్రికా) వంటి పలువురు స్టార్ క్రికెటర్లు వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. అమీ జోన్స్ ఇంగ్లండ్ జట్టులో కీలక ప్లేయర్‌గా కొనసాగుతుండగా, పీపా క్లియరీ ఆస్ట్రేలియా దేశవాళీ సర్క్యూట్‌లో బౌలర్‌గా రాణిస్తున్నారు.

# స్పోర్ట్స్

## పంజాబీ నటితో ప్రేమలో క్రికెటర్ అర్షదీప్ సింగ్



తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

టీమిండియా స్టార్ పేసర్, పంజాబ్ కింగ్స్ బౌలర్ అర్షదీప్ సింగ్ వ్యక్తిగత జీవితం గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అర్షదీప్ ప్రేమలో ఉన్నాడంటూ నెట్టింట వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... అర్షదీప్ సింగ్ ఇటీవల తన స్నాప్‌చాట్ ఖాతాలో ఒక అమ్మాయి చేయి పట్టుకుని ఉన్న ఫొటోను షేర్ చేశాడు. అందులో ఆ అమ్మాయి ముఖం కనిపించనప్పటికీ, ఆమె చేతిపై ఉన్న ఒక ప్రత్యేకమైన టాటూ నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. నెటిజన్ల పరిశోధన ప్రకారం.. ఆ టాటూ పంజాబ్‌కు చెందిన ప్రముఖ మోడల్, నటి సమ్రీన్ కౌర్ చేతిపై ఉన్న టాటూతో సరిపోలింది. దీంతో వీరిద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని అభిమానులు ఒక అంచనాకు వచ్చారు.

**సమ్రీన్ కౌర్ గురించి కొన్ని విశేషాలు:**

26 ఏళ్ల సమ్రీన్ పంజాబ్‌కు చెందిన నటి. పుణేలోని సింబయోసిస్ కాలేజీలో విద్యాభ్యాసం చేసింది. 2018 మిస్ ఇండియా పోటీల్లో ఫైనలిస్ట్‌గా నిలిచింది. పంజాబీ మ్యూజిక్ వీడియోలు, ఓటీటీ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు 4 మిలియన్లకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. అయితే ఈ వార్తల పై అర్షదీప్ కానీ, సమ్రీన్ కౌర్ కానీ ఇప్పటి వరకు స్పందించనప్పటికీ. వీరికి సంబంధించిన వార్త మాత్రం వైరల్

తెలంగాణ పత్రిక



# అల్లరి నరేశ్ 'కనక దుర్గ'... కెమెరా స్విచాన్ చేసిన కొణిదెల సురేఖ

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



విలక్షణ నటుడు అల్లరి నరేశ్ హీరోగా 'కనక దుర్గ' అనే కొత్త చిత్రం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సురేఖ కొణిదెల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమిళ చిత్ర పరిశ్రమలో విజయవంతమైన నిర్మాణ సంస్థ అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. టెంపుల్ టౌన్ పిక్చర్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ భక్తి ప్రధాన యాక్షన్ చిత్రానికి బీవీఎస్ రవి కథను అందించారు. ఇందులో కాజల్ చౌదరి హీరోయిన్‌గా, సుబ్బరాజు కీలక పాత్రలో నటించనున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, మెగాస్టార్ చిరంజీవి అర్ధాంగి కొణిదెల సురేఖ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్వప్న దత్ గౌరవ దర్శకత్వం వహించారు. భక్తి, యాక్షన్, భావోద్వేగాల కలయికగా ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం తెలిపింది. ఈ కార్యక్రమానికి అల్లు అరవింద్‌తో పాటు శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీశ్ శంకర్, ప్రశాంత్ వర్మ, కోన వెంకట్, స్వప్న దత్ వంటి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. దక్షిణ భారతంలో తమ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, ఇప్పుడు 'కనక దుర్గ'తో తెలుగులోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. తెలుగు నేల ఆధ్యాత్మికతతో ముడిపడి ఉన్న కథతో తమ ప్రయాణం మొదలవ్వడం ప్రత్యేకమని టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాతలు బీవీఎస్ రవి, అజిత్ ఠాకూర్ పేర్కొన్నారు. అమ్మవారి పై ఉన్న భక్తితో పాటు, ఒక మనిషి ఉన్నత శక్తిని ఎదుర్కొన్నప్పుడు ఏం జరుగుతుందనే కథాంశంతో ఈ సినిమా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ మద్దాలి వివరించారు.

## ఈ పాత్ర ఇంత వరకు కమల్ హాసన్ కు కూడా దొరకలేదు: జేడీ చక్రవర్తి

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



తన తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో నటుడు జేడీ చక్రవర్తి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో తన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతుందో చెబుతూ, ఏకంగా విశ్వనటుడు కమల్ హాసన్ పేరును ప్రస్తావించారు. కమల్ హాసన్ తన కెరీర్‌లో ఎన్నో ప్రయోగాత్మక పాత్రలు చేసినప్పటికీ, 'గాయపడ్డ సింహం'లో తాను చేస్తున్నటువంటి విభిన్నమైన క్యారెక్టర్ ఆయనకు ఇప్పటివరకు దొరకలేదని పేర్కొన్నారు. అదే సమయంలో "కమల్ హాసన్ గారు ఒక అద్భుతం. ఆయన కాలి గోటికి కూడా నేను సరిపోను" అంటూ తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సినిమాలో తరుణ్ భాస్కర్, ఫరియా అబ్దుల్లా హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. స్వీకార్ అగస్తీ సంగీతం అందిస్తుండగా, పవన్ సాదినేని సమర్పణలో ఈ చిత్రం రూపొందుతోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# హీరో విజయ్ పై ఐశ్వర్య రాజేశ్ ప్రశంసలు

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



దక్షిణాదిలో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య రాజేశ్... తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తరుణంలో ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విజయ్ ఎప్పుడూ ఇతరుల గురించి తప్పుగా మాట్లాడరని, తన పని తాను చేసుకుంటూ వెళతారని ఐశ్వర్య తెలిపారు. బయట ఎంతమంది విమర్శలు చేసినా, నెగెటివ్‌గా మాట్లాడినా ఆయన అవేమీ పట్టించుకోకుండా తన లక్ష్యం వైపు సాగిపోతారని ఆమె పేర్కొన్నారు. ఈ లక్షణమే ఆయనను అందరికంటే ప్రత్యేకం చేస్తుందని అభిప్రాయపడ్డారు. "విజయ్ సార్‌కు తన అభిమానులే ప్రపంచం. వారిని ఎలా సంతోషపెట్టాలో ఆయనకు బాగా తెలుసు" అని ఐశ్వర్య కొనియాడారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా తన వారి కోసం ఆయన నిలబడతారని, నేటి యువతకు ఆయన ఒక గొప్ప రోల్ మోడల్ అని ఆమె ప్రశంసించారు. సినిమాల విషయానికి వస్తే... ఆమధ్య వెంకటేశ్ సరసన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమాతో ఐశ్వర్య భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం తిరువీర్‌తో కలిసి 'ఓ సుకుమారి' అనే చిత్రంలో నటిస్తూనే, మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.


# ఆర్టిస్టులు అంటే నేరస్తులా.. ట్రోలర్ల పై రేణు దేశాయ్ ఆగ్రహం

తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7



సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ట్రోలింగ్ పై నటి రేణు దేశాయ్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన వ్యక్తిగత జీవితంపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న నెటిజన్లకు 'భావ ప్రకటన స్వేచ్ఛ' అంటే ఏమిటో వివరిస్తూ ఒక ఘాటు వీడియోను షేర్ చేశారు. "మీ దృష్టిలో ఆర్టిస్టులు అంటే నేరస్తులా లేక ఉగ్రవాదులా? అంత దారుణమైన మాటలతో దూషించడానికి వారు చేసిన తప్పేంటి?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. సెలబ్రిటీల అభిప్రాయాలు నచ్చకపోతే అన్‌ఫాలో చేయాలి తప్ప, నీచమైన పదజాలంతో దాడి చేయడం సంస్కారం కాదని హితవు పలికారు. చాలామంది బూతులు తిట్టడాన్ని 'భావ ప్రకటన స్వేచ్ఛ' అని పొరబడుతున్నారని, కానీ అది ముమ్మాటికీ వేధింపు కిందకే వస్తుందని ఆమె అన్నారు. ప్రతి మనిషికి సమాజంలో గౌరవంగా బతికే హక్కు ఉందని, ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛను కాలరాయకూడదని రేణు అన్నారు. కష్టపడి పని చేస్తూ గౌరవంగా జీవించే కళాకారులను టార్గెట్ చేయడం మానుకోవాలని సూచించారు. ఇప్పటికే తనను దూషించిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, నెటిజన్లు తమ ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. సోషల్ మీడియాలో హుందాగా ప్రవర్తించడం నేర్చుకోవాలని, అనవసరపు విమర్శలతో ఇతరుల మనోభావాలను దెబ్బతీయవద్దని ఆమె కోరారు.

# 'మా కా సమ్' (అమెజాన్ ప్రైమ్) సిరీస్ రివ్యూ



తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

మోనా సింగ్ – మిహిర్ అహూజా ప్రధానమైన పాత్రలను పోషించిన సిరీస్ 'మా కా సమ్'. నికోలస్ ఖార్కోమ్ గోర్ దర్శకత్వం వహించిన సిరీస్ ఇది. 8 ఎపిసోడ్స్ గా ఈ సిరీస్ ను రూపొందించారు. హిందీతో పాటు, తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ భాషల్లో ఈ సిరీస్ ను అందుబాటులోకి తెచ్చారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సిరీస్ కథమేమిటనేది ఇప్పుడు చూద్దాం. 'ఢిల్లీ' నగరంలో వినీత (మోనా సింగ్) ఆమె తనయుడు అగస్త్య (మిహిర్ అహూజా) నివసిస్తూ ఉంటారు. అగస్త్య కాలేజ్ చదువును కొనసాగిస్తూ ఉంటాడు. అతని స్నేహితులే జున్నార్ .. అనీ .. మంజరి. వాళ్లతో కలిసి అతను కాలేజ్ లైఫ్ ను ఎంజాయ్ చేస్తుంటాడు. 'అనీ' అతనిని ప్రేమిస్తూ ఉంటుంది. మ్యాథ్స్ లో అతను జీనియస్. గణితానికి తర్కాన్ని జోడించి సమస్యలను పరిష్కరించడం అతని ప్రత్యేకత. అందువలన లెక్చరర్ 'ఇరా' (అంగీరా ధర్) కూడా అతని పట్ల ప్రత్యేకమైన అభిమానాన్ని చూపిస్తూ ఉంటుంది. అగస్త్య చిన్నతనంలోనే అతని తండ్రి ఇల్లొదిలి వెళ్లిపోతాడు. అతను ఏమైపోయాడనేది ఎవరికీ తెలియదు. తండ్రి కోసం ఎంతో కాలం పాటు ఎదురుచూసి అగస్త్య అలసిపోతాడు. తన కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లికి ఒక తోడును వెతికే ప్రయత్నంలో పడతాడు అగస్త్య. అందుకోసం ఆమె డేటింగ్ కి డేట్లు ఏర్పాటు చేస్తుంటాడు. తనకి సరైన జోడీని ఎంచుకునే ప్రయత్నంలో ఆమె కొడుకు సాయం తీసుకుని ముందుకు వెళుతుంటుంది. ఈ క్రమంలో అగస్త్య ప్రమేయం లేకుండా ఆమె తల్లికి 'అభిమన్యు' అనే వ్యక్తి తారసపడతాడు. అభిమన్యు అంటే అగస్త్యకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఈ నేపథ్యంలో 'జేబీ' అనే వ్యక్తి 'ఇరా' మేడమ్ తో చనువుగా ఉండటాన్ని చూసి అగస్త్య అసహనానికి లోనవుతాడు. అలాగే 'ఇరా'తో అగస్త్య సన్నిహితంగా ఉండటాన్ని చూసి 'అనీ' అపార్థం చేసుకుంటుంది. ఒక వైపున తల్లి .. మరో వైపున 'అనీ' .. ఇంకొక వైపున 'ఇరా' .. అగస్త్య జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తారు? అనేదే కథ. రవీందర్ రంధావ – సుమ్రిత్ షాహీ తయారు చేసిన కథ ఇది. తల్లీ కొడుకుల అనుబంధం చుట్టూ ఈ కథ తిరుగుతూ వెళుతుంది. తన భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లికి ఒక కొత్త జీవితాన్ని ఇవ్వడం కోసం ఆరాటపడే ఒక కొడుకు కథ ఇది. భర్త కోసం ఎంతో కాలంగా ఎదురుచూసి అలసిపోయి, ఒక కొత్త ప్రయాణాన్ని ఆరంభించాలనే ఆలోచన చేసిన భార్య కథ ఇది. ఈ రెండు పాత్రలను ప్రధానంగా చేసుకుని దర్శకుడు ఈ కథను నడిపించాడు. చాలా కాలంగా భర్తకి దూరమై బాధ్యతలతోనే కాలం గడిపిన 'వినీత' డేట్ చేయడానికి సిద్ధపడుతుంది. ఆమె డేట్ చేయడానికి తగిన వ్యక్తులను ఆన్ లైన్ ద్వారా అగస్త్య ఎంపిక చేస్తూ ఉంటాడు. అలాగే తన కాలేజ్ లో సబ్జెక్ట్ కి సంబంధించిన విషయాలను 'ఇరా'తో షేర్ చేసుకుంటూ, 'అనీ'తో ప్రేమాయణాన్ని కొనసాగిస్తూ .. తన జీవితంలోకి కొత్త రంగులను అతను ఆహ్వానిస్తూ ఉంటాడు.

# సినిమాల్లోకి దేవయాని కూతురు.. తెలుగు 'కోర్టు' రీమేక్‌తో ఎంట్రీ!




తెలంగాణ పత్రిక ఏప్రిల్ 7

ఒకప్పటి ప్రముఖ నటి దేవయాని వారసురాలు సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. ఆమె చిన్న కుమార్తె ప్రియాంక రాజ్ కుమారన్ నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. విశేషమేమిటంటే.. ఆమె తొలి చిత్రం 2024లో తెలుగులో వచ్చిన 'కోర్టు' సినిమాకు తమిళ రీమేక్ కావడం. పోక్సో చట్టం పై అవగాహన కల్పించే సామాజిక సందేశంతో ఈ చిత్రం రూపొందుతోంది. తెలుగు సినిమా 'కోర్టు' ఆధారంగా తమిళంలో 'రంజన్: ది అడ్వకేట్' పేరుతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఆయన కుమారుడు జీన్స్ ప్రశాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. తెలుగు మాతృకలో శ్రీదేవి పోషించిన కథానాయిక పాత్రను ప్రియాంక పోషించనుంది. ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ చిత్రంతోనే నిర్మాత ఎస్. కదిరేశన్ కుమారుడు హరి కూడా నటుడిగా పరిచయం అవుతుండటం గమనార్హం. తెలుగులో హర్ష్ రోషన్ పోషించిన పాత్రను హరి చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన దేవయాని, తన కుమార్తెను చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. తన కూతురు తప్పకుండా రాణిస్తుందన్న నమ్మకాన్ని ఆమె వెలిబుచ్చారు. ఈ వేడుకకు నటుడు విశాల్, దర్శకుడు వెట్రిమారన్ వంటి ప్రముఖులు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143